జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 6 సంచిక - 21 పక్షపత్రిక నవంబర్ 1-15, 2015




## సుప్రీంకోర్టుని రాజ్యాంగ ప్రజాస్వామ్యం బోనులో నిలబెట్టిన లోక్‌సత్తా

### ఎన్‌జేఏసీ (99వ రాజ్యాంగ సవరణ)పై తీర్పు నేపథ్యంలో సుప్రీంకోర్టు జవాబుదారీతనంపై తొలిసారి విస్తృత చర్చ



'బైబిల్–సృష్టికర్తలు–దేవుళ్లు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న
లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్

# కులమతాలను వదిలేస్తేనే సుస్థిర ప్రగతి : జేపీ

దేశాన్ని, సమాజాన్ని పట్టిపీడిస్తున్న కులమతాలను వదిలేస్తేనే సుస్థిర ప్రగతి సాధ్యమవుతుందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ కాన్ఫరెన్స్ హాలులో మానవ వికాస వేదిక మహాసభలో ముఖ్యప్రసంగం చేస్తూ, మనదేశంలో ఆహారపు అలవాట్లపై, ప్రశ్నించే కలాలపై దాడులు జరగటం అన్యాయమన్నారు. హిందూ మతాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని, సాంకేతికంగా, ఆర్థికంగా పెరుగుదల జరుగుతున్నా మానవత్వం మాత్రం పెరగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం మతాన్ని తాలిబన్లు ఎలా వక్రీకరిస్తున్నారో, హిందూ మతాన్ని కొందరు అలా పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. భారతీయత అంటే చార్వాకుల్ని రుషులుగా, బుద్ధుడిని దేవుడిగా మార్చిన విధానంగా ఉంటుందని, దాడి చేసి లేకుండా చేసే స్వభావంగా కాదని అన్నారు. మనం ఒక నాగరిక, సమసమాజాన్ని నిర్మించటానికి ఎంత సుదీర్ఘ సంక్లిష్ట ప్రయాణం చేయాల్సి ఉందో హర్యానాలో అమాయక దళిత పిల్లలపై దారుణ హింస రుజువు చేస్తోందన్నారు. సమాజం ఆత్మశోధన చేసుకోవాలన్నారు. మనకు చెప్పుకోదగిన ఘన సంస్కృతే కాకుండా, దిద్దుకోవాల్సిన ఘోరతప్పిదాలు కూడా ఉన్నాయన్నారు. గొప్ప రాజ్యాంగం, అందరికీ ఓటు హక్కు ఉన్నంత మాత్రాన ప్రజాస్వామ్యమైపోదన్నారు. మనం సమాజాన్ని నిర్మించుకోవాలి, పాలకులకు, ప్రజలకు కూడా పాఠాలు చెప్పాలి అన్నారు. అధికారం కోసం సమాజాన్ని, రాజకీయాల్ని దిగజారిస్తే ఎంత ప్రమాదమో పార్టీలు కూడా గుర్తించాలన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటాంలే అంటే, అప్పటికే చాలా నష్టపోతామన్నారు. ప్రతి బిడ్డ సామర్థ్యం వికసించేలా అందుబాటులో నాణ్యమైన విద్య, ఆరోగ్యం, కనీస వసతులు, అవినీతి లేని ప్రభుత్వ సేవలు లేకుండా, గొప్ప ఆధునిక దేశంగా నిర్మిస్తామంటే అవి కలలు, కబుర్లే అవుతాయని హెచ్చరించారు. నేటితరం పిల్లలకు శాస్త్రీయ విజ్ఞానాన్ని అందించాలని జేపీ అన్నారు. మనదేశంలో పెళ్ళిళ్లు, శుభకార్యాలు, ఆచారాల పేరుతో ఏటా రూ.10 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారని, జాతీయ ఆదాయంలో ఐదుశాతం ఆడంబరాలకు ఖర్చు చేస్తున్నారని అన్నారు. అమరావతి శంకుస్థాపన పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేయటాన్ని జేపీ ఖండించారు. ఈ సందర్భంగా మతరహిత జీవనవిధానం ప్రయోజనాలు అంశంపై జి.విజయం, భారతీయ లౌకికవాదం- ఒక పరిశీలన అంశంపై మానవ వికాస వేదిక వ్యవస్థాపకులు బి. సాంబశివరావు, భావప్రకటనా స్వేచ్ఛకు ఎదురయ్యే సవాళ్లు-పరిష్కారాలుపై జనసాహితీ సంస్థ దివికుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఎన్. విక్రమ్, మోతుకూరి వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, వై.రాజు, అశోక్, వి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక నవంబర్ 1-15 2015

సంపుటి - 6 సంచిక - 21

## లోపలి పేజీల్లో...

కంచే చేను మేసింది ........ 5

వ్యవస్థీకృత సంస్కరణకు హెచ్చరించే తీర్పు........ 8

ఇతర ప్రజాస్వామ్య దేశాల్లో ఉన్నత న్యాయవ్యవస్థ...... 11

కొలీజియంపై సుప్రీంకోర్టు వాదన సరికాదు........ 12

న్యాయవ్యవస్థ జవాబుదారీతనం ఆవశ్యకతపై........ 13

లోక్‌సత్తా సుదీర్ఘ కృషి ఎన్‌జేపసీ........ 14

ఉమ్మడి పౌరస్మృతిపై మళ్లీ చర్చ........ 19

యమర్జెన్సీపై తిరుగుబాటు........ 20

కొలీజియం వ్యవస్థలో సంస్కరణలు అవసరం........ 21

ఏరు దాటాక తెప్ప తగలేశారు ........ 22

ప్రత్యేక హోదా కావాలని బాబు అడగనే లేదు........ 26

పోలీసు సంస్కరణలకు పూర్తి మద్దతు........ 28

మార్కెట్‌యార్డులను రైతులకు అప్పచెప్పాలి........ 30

స్థానిక ప్రభుత్వాల సాధికారత ఊసే లేని స్వచ్ఛభారత్.. 31

కళ్లు చిదంబరానికి జేపీ నివాళి........ 32

ప్రత్యేక హోదా సాధనకు లోక్‌సత్తా పోరాడుతుంది..... 33

సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# చంద్రబాబు ఈవెంట్ మేనేజర్‌లా కాకుండా ముఖ్యమంత్రిలా వ్యవహరించాలి



అమరావతి రాజధానికి లోక్‌సత్తా వ్యతిరేకం కాదు. కానీ ఆ పేరుతో ఆర్భాటాలకు, అధికార కేంద్రీకరణకు మాత్రం ఖచ్చితంగా వ్యతిరేకం. ఆంధ్రప్రదేశ్ రాజధాని శంకుస్థాపన విషయంలో డబ్బును లెక్కచేయకుండా వేడుక నిర్వహించామన్న సంతృప్తే తప్ప ఫలితం రాలేదు. శంకుస్థాపనకు వచ్చిన ప్రధానమంత్రిని ఏంకావాలో అడగకుండా, 'సార్ సార్, మీ దయ మా ప్రాప్తం' అన్నట్టుగా చంద్రబాబు నాయుడు వ్యవహరించారు. చంద్రబాబు ఈవెంట్ మేనేజర్‌లా, అమరావతి కార్పొరేషన్ మేయర్‌లా కాకుండా ముఖ్యమంత్రిలా వ్యవహరించాలి. ప్రజాధనంతో విందులు, వినోదాలు, ఆర్భాటాలు, విలాసాలు మానాలి. వేడుకకు పదుల కోట్లు, క్యాంప్ ఆఫీసుకు రూ.10 కోట్లు, విమానాలకు వందల కోట్లు ఖర్చు చేయటమేమిటి? రాష్ట్ర ఖజానాలో లక్షల కోట్ల ప్రజాధనం మూలుగుతోందా? రాష్ట్రం ఆర్థిక నష్టంలో ఉంటే, మంత్రులకు రూ.40-50 లక్షలు విలువ చేసే ఏసీ కార్లు అవసరమా? గోదావరి పుష్కరాలు, అధికారుల విభజన, పట్టిసీమ, అమరావతి ఈవెంట్ మేనేజ్‌మెంట్లు అయిపోయాయి. మరో ఆరేడునెలల్లో కృష్ణా పుష్కరాలు ఉన్నందున మరో ఈవెంట్‌తో ప్రజల ముందుకొస్తారా? 30వేల ఎకరాల్లోని రాజధానే సర్వస్వం అంటే, ఇక జిల్లాలోని మిగతా ప్రాంతాలు, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలు ఏమైపోవాలి? అధికారాన్ని ఆరాధించే, పాలకులను దేవుళ్లుగా పూజించే పాతకాలపు ఫ్యూడల్ సంస్కృతి నుంచి బైటపడదాం. మనకు సరైన పరిపాలన, ప్రజల జీవితాల చుట్టూ తిరిగే బలమైన ఆర్థిక వ్యవస్థ కావాలి. న్యూయార్క్, చికాగో, లాస్‌ఏంజిల్స్ ఈ నగరాలేవీ రాజధానులు కావు. అమెరికా వంటి దేశాల్లో రాష్ట్రాల రాజధానుల పేర్లు కూడా మనకు తెలియవు. రాజధాని అంటే ప్రభుత్వ కార్యాలయాలుండే ప్రాంతం. ప్రజలకు రాజధానితో పెద్ద అవసరం ఉండకూడదు. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా ప్రజలుండే చోటే అధికారం, పాలన, విద్య, వైద్యం, నైపుణ్యాలు, రోడ్లు, మంచినీరు, పారిశుద్ధ్యం తదితర కనీస సౌకర్యాలు అన్నీ ఉండాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా పకడ్బందీ చట్టం అమలు జరగాలి. స్థానికంగా అవినీతి జరిగితేనే పైనుంచి ప్రభుత్వం స్పందించాలి. అంతేతప్ప రాష్ట్రమంటే రాజధానే అన్నట్టు వ్యవహరించటం ముమ్ముందు ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుంది. పరిపాలన అంటే ఆర్భాటం, పెత్తనం కాదు. కేంద్రంపై ఒత్తిడి తెస్తే తప్ప విభజన వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేం. కార్పొరేట్ ఐ.టి, సెంట్రల్ ఎక్సయిజ్ పన్ను రాయితీల్ని నూరు శాతం సాధించుకోవాలి. పరిశ్రమలతో యువతకు ఉపాధి కల్పించాలి. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు ప్రత్యేక హోదా రాష్ట్రాలకంటే వెనకబడి ఉన్నాయి. ఈ గణాంకాల్ని లోక్‌సత్తాయే పదేపదే చెబుతోంది. ఆంధ్రప్రదేశ్‌కి ఒకవేళ ప్రత్యేక హోదా ఇవ్వనంటే అందుకు నూటికి నూరుశాతం సమానంగా ఏమిస్తారో కేంద్రం విస్పష్టంగా తెలియచేయాలి. కనీసం వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వటం అవసరం. దేశవ్యాప్తంగా ఇలాంటి డిమాండ్ వస్తే, ఆ రాష్ట్రాల్లోని జిల్లాలకూ వర్తింపచేయండి. తెలుగువారు అభ్యంతరం చెప్పాల్సిన పన్లేదు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల్ని సాధించుకోవటం, ఉత్తర తెలంగాణ జిల్లాలకు రాయితీల్ని సాధించుకోవటం తెలంగాణరాష్ట్రానికి కూడా ఎంతో అవసరం. అందుకే విభజన చట్టంలో, పార్లమెంటులో ఇచ్చిన హామీల అమలుకు కేంద్రంపై పోరాడేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు కూడా ముందుకు రావాలి. అమరావతి శంకుస్థాపనలో ఆయన పాల్గని సానుకూల సంకేతాన్నిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ అన్ని పార్టీలనూ కలుపుకుని కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. తెలుగు భవిత కోసం విభజనకు ముందు, విభజన సమయంలో, అసెంబ్లీలో, బైట చేసిన, చేస్తున్న పోరాటాన్ని లోక్‌సత్తా కొనసాగిస్తుంది.

- డా॥ జయప్రకాష్ నారాయణ్




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.



# కంచే చేను మేసింది!

**ఎన్‌జేఏసీని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పుని ప్రజలు తిరస్కరించాలి,**

**ఇది రాజకీయ పోరాటం కాదు, రాజ్యాంగ రక్షణ కోసం జాతిపోరాటం: జేపీ**

**పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి**

**పార్టీలకతీతంగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి**

ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పార్లమెంటుకు, ప్రభుత్వానికి, పౌరులకు భాగస్వామ్యం కల్పించే జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయటం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధం, ప్రజలు, పార్లమెంటు నిర్ద్వంద్వంగా ఈ తీర్పుని తిరస్కరించాలి అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగాన్ని తూ నాబొడ్డు అని సుప్రీంకోర్టే అనటం సాధారణ విషయం కాదు, ఇది రాజకీయ పోరాటం కాదు, జాతిపోరాటం అన్నారు. దేశ చరిత్రలోనే కీలకఘట్టమైన ఈ తీర్పు మీద పార్లమెంటు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి లోతైన చర్చతో రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలని, పార్లమెంటు సార్వభౌమాధికారాన్ని పరిరక్షించాలన్నారు. కంచే చేను మేసినట్టు అత్యున్నత న్యాయస్థానం వ్యవహరించిందని, రాజ్యాంగాన్ని ధిక్కరించిందని అన్నారు. సుప్రీంకోర్టుకు స్వయంప్రతిపత్తి రాజ్యాంగం నుంచి వస్తుంది తప్ప రాజ్యాంగాన్నే కాదనే అధికారం సుప్రీంకోర్టుకు లేదన్నారు. న్యాయమూర్తులు స్వయంభులు, దైవదూతలు, దైవాంశసంభూతులు, చక్రవర్తులు కాదని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలకు లోబడి పనిచేయాల్సిందేనన్నారు.

**ఎన్‌జేఏసీని ఏర్పాటుకు పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన 99వ రాజ్యాంగ సవరణను**

**కొట్టివేస్తూ, జడ్జీలను జడ్జీలే నియమించుకునే పాత కొలీజియం వ్యవస్థనే కొనసాగించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై జయప్రకాష్ నారాయణ్ ఇక్కడ అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ,** ప్రపంచంలోని మరే ప్రజాస్వామ్య దేశంలోనూ ఇలా మాట్లాడే సాహసాన్ని న్యాయవ్యవస్థ చేయదని, కానీ రాజకీయం దిగజారి, అరుపులు, నినాదాలు తప్ప విధానాల సంక్లిష్టతల గురించి అవగాహన తక్కువ ఉండటం వల్ల మనదేశంలో ఇలాంటి తీర్పుని ఇచ్చారని అన్నారు. ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా జడ్జీలను జడ్జీలే నియమించు కోరన్నారు. ఫ్రాన్స్, కెనడా, బ్రిటన్ తదితర దేశాలన్నిటిలో ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వాల, పార్లమెంటుల పాత్ర ఉంటుందన్నారు. చాలా దేశాల్లో సమాజంలోని పౌరులకు కూడా అవకాశం కల్పిస్తారన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి ఉన్నత న్యాయమూర్తులను నియమించమని రాజ్యాంగంలో పదజాలం ఉంటే, దానికి విపరీతార్థాలు చెప్పి ప్రపంచంలో ఏ ప్రజాస్వామిక దేశంలోనూ లేనిరీతిలో జడ్జీలను జడ్జీలే నియమించుకునే విడ్డూరమైన కొలీజియం వ్యవస్థని మన సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిందని, ఈ తరహా వ్యవస్థనే కొనసాగించాలనుకుంటోందన్నారు.

*భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26, 1949న డా॥ అంబేద్కర్ మాట్లాడుతూ, ఈ రాజ్యాంగం విఫలమైతే తప్పు రాజ్యాంగానిది కాదు, దాన్ని అమలు చేసే వారిదేనని హెచ్చరించిన విషయాన్ని జేపీ ఉటంకించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన సుప్రీంకోర్టే ఈవేళ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందన్నారు.*

దైవదూతల్లా, దైవాంశసంభూతుల్లా తమను తామే నియమించకుంటామని, ప్రభుత్వం, ప్రజలతో తమకు సంబంధం లేదని చెప్పటం ద్వారా సుప్రీంకోర్టు తన విశ్వసనీయతను తానే తగ్గించుకుందని జేపీ అన్నారు. దేశంలో సంక్లిష్టమైన మందిరం-మసీదు, రిజర్వేషన్లు, నదీజలాల పంపిణీ, ఆంధ్ర-తెలంగాణ వంటి రాష్ట్రాల మధ్య తగాదాలు వంటి ఘర్షణలు తలెత్తినప్పుడు రాజకీయం వాటిని పరిష్కరించటం కష్టమని, అటువంటి పరిస్థితుల్లో విశ్వసనీయమైన సుప్రీంకోర్టు అవసరమని, ఇలాంటి తీర్పులతో సుప్రీంకోర్టు తన విశ్వసనీయతను కోల్పేయి దైవదూతలం, దైవాంశసంభూతులం అంటూ వ్యవహరిస్తే ఉపద్రవాలు ముంచుకొచ్చి దేశ సమగ్రత కూడా ప్రమాదంలో పడుతుందన్నారు.

దేశం కన్నా న్యాయవ్యవస్థ ఎక్కువ కాదని, ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థయినా ప్రజల మద్దతును ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పొందాల్సిందేనని, అలా ప్రజలతో సంబంధం లేని వ్యవస్థలకు విశ్వసనీయత, నైతికత ఉండదని జేపీ స్పష్టంచేశారు. పార్లమెంటు, పౌరులు, ప్రభుత్వం పాత్ర అక్కర్లేదు అంటే ఇక కలెక్టర్లని కలెక్టర్లు, ఎన్నికల సంఘాన్ని ఎన్నికల సంఘం, యూపీఎస్‌సీని యూపీఎస్‌సీ, ఇలా ప్రతి వ్యవస్థా తనను తానే నియమించుకోవచ్చని, రేపు ఎన్నికలు, పార్లమెంటు కూడా అక్కర్లేదనవచ్చని అన్నారు. ఈ ధోరణి అరాచకత్వానికి, నియంతృత్వానికి దారితీస్తుందన్నారు.

భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26, 1949న డా॥ అంబేద్కర్ మాట్లాడుతూ, ఈ రాజ్యాంగం విఫలమైతే తప్పు రాజ్యాంగానిది కాదు, దాన్ని అమలు చేసే వారిదేనని హెచ్చరించిన విషయాన్ని జేపీ ఉటంకించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన సుప్రీంకోర్టే ఈవేళ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందన్నారు. దేశ చరిత్రలో ఇది కీలకఘట్టమని, 99వ రాజ్యాంగ సవరణతో ఈ చట్టాన్ని తీసుకురావటానికి లోక్‌సత్తా 14-15 ఏళ్ల పాటు పోరాటం చేసిందని అన్నారు. విజ్ఞతకు, నిర్భీతికి మారుపేరైన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్‌లను ఒకచోటకి చేర్చి ఈ బిల్లును రూపొందించిందని, పదేళ్ల పాటు కృషి చేసి అన్ని పార్టీలనూ ఒప్పించిందని అన్నారు. అందుకే ఉప్పునిప్పులా ఉండే ఎన్డీయే, యూపీయేలు ఏకగ్రీవంగా పార్లమెంటులో 2014 డిసెంబర్‌లో ఈ బిల్లును ఆమోదించాయని గుర్తుచేశారు. ఎంతో నిజాయతీతో, ముందుచూపుతో, అత్యుత్తమ న్యాయమూర్తుల భాగస్వామ్యంతో లోక్‌సత్తా రూపొందించింది కాబట్టే పార్టీలకతీతంగా అది ఆమోదం పొందిందన్నారు.

**ఇంప్లీడ్ అవుతానన్నా బెంచ్ అవకాశం ఇవ్వలేదు,**

**ఎన్‌జేఏసీపై కృషి, సమాచారం పుస్తకరూపంలో అందరికీ, స్పందించిన సోనియా**

ఈ బిల్లు వెనక కృషిని, వివరాలను పుస్తకరూపంలో రాష్ట్రపతికి, ఉపరాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, ప్రతిపక్ష నేతకు, అన్ని పార్టీలకు, పార్లమెంటు సభ్యులందరికీ పంపించామని, లేఖ రాశామని, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఇప్పటికే ఎన్‌జేఏసీకి మద్దతిస్తామని తిరిగి లేఖ రాశారని తెలిపారు. ఆ పుస్తకాన్ని, లేఖలను మీడియాకు జేపీ విడుదల చేశారు. ఎన్‌జేఏసీపై వాదనల సమయంలో ఇంప్లీడ్ కావటానికి తాను అభ్యర్థించినా సుప్రీంకోర్టు బెంచ్ అనుమతించలేదని, వారికి కూడా ఈ వివరాలు పంపానని తెలిపారు. ఈ చట్టంలోని సంక్లిష్ట దేశ ప్రయోజనాలను గుర్తించి సంయమనంతో తీర్పునివ్వాలని కోరానన్నారు. కానీ వారికి విషయం బోధపడకో, ఏం చేసినా చెల్లుతుందని భావించో, రాజ్యాంగానికి వేరే భాష్యం అనుకునో ఎన్‌జేఏసీని వ్యతిరేకిస్తూ తీర్పునిచ్చారన్నారు.

> *"నిజాయతీ, నిష్పాక్షికత, రాజ్యాంగం పట్ల గౌరవం, రాజకీయాల్లో, వ్యవస్థల్లో మౌలికమార్పు కోసం అసాధారణ కృషి అర్హతలుగా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఈ పోరాటానికి పిలుపునిస్తోంది. కానీ ఈ పోరాటం చేయాల్సిన బాధ్యత, అధికారం పార్లమెంటుది, పౌరసమాజానిది. లోక్‌సత్తా తన వంతు పాత్ర పోషిస్తుంది"*

## ఢిల్లీకి జేపీ

ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి సహా అందరినీ కలిసి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తానని జేపీ తెలిపారు. పార్లమెంటు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ తీర్పుపై కనీసం వారంరోజులపాటు చర్చించాలని, సుప్రీంకోర్టు రాజ్యాంగవ్యతిరేక తీర్పునకు వ్యతిరేకంగా పార్లమెంటు సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు నడుం బిగించాలని, ఇది ప్రభుత్వ, పార్టీల వ్యవహారం కాదని అన్నారు. ఈ తీర్పును సరిచేసి, న్యాయమూర్తులు దైవాంశసంభూతుల్లా తమను తాము నియమించుకోకుండా, ఉన్నత న్యాయమూర్తుల నియామకాలు పారదర్శకంగా జరిగేలా పభుత్వం, పార్లమెంటు చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలోని అన్ని రాజ్యాంగసంస్థల నిష్ణాతుల్ని, ప్రపంచదేశాల నిపుణుల్ని పిలిపించి ప్రజలకు వాస్తవాలు అర్థమయ్యేలా చర్చ చేయాలని, న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక ప్రాతినిధ్యాన్ని కాపాడేలా ఏకాభిప్రాయాన్ని సాధించాలని అన్నారు. మీడియా దేశవ్యాప్తంగా ఈ కీలక తీర్పుపై ప్రామాణిక చర్చ జరిపి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.

**రాజకీయాలు దిగజారటం వల్లే ఇంతదాకా వచ్చింది, ప్రక్షాళనపైనా పార్లమెంటు కళ్లు తెరవాలి**

దాంతోపాటు అసలీ పరిస్థితి ఇక్కడిదాకా రావటానికి రాజకీయాలు దిగజారటమే కారణమని పార్లమెంటు గుర్తించాలని జేపీ అన్నారు. అవినీతి, గూండాయిజం వంటి వాటితో రాజకీయం దిగజారటం వల్లే ప్రజలు రాజకీయానికి ప్రత్యామ్నాయంగా న్యాయవ్యవస్థ మీద మితిమీరి ఆధారపడుతున్నారని, ఆ ధోరణి కొనసాగితే అది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్నే హరించివేస్తుందని అన్నారు. మన ప్రజాస్వామ్యంలో, రాజకీయంలో ఉన్న లోపాలపై లోక్‌సత్తా చేసినంత పోరాటం గత ఇరవైఏళ్లలో ఎవరూ చేయలేదని, అధికారం లేకుండానే 99వ రాజ్యాంగసవరణ సహా 15 మౌలిక మార్పుల్ని శాంతియుతంగా సాధించి చూపిందని, కానీ రాజకీయాల్లో మార్పునకు రాజకీయాలను ద్వేషించటం కాకుండా మరింత మరింత మంచి రాజకీయం దిశగా ప్రక్షాళన చేయటం, అత్యుత్తములు ఎన్నికయ్యే అవకాశాన్ని కల్పించటమే మార్గమని ఆచరించి చూపిందని అన్నారు. రాజకీయాలలో విశ్వసనీయత, నైతికత పెంచటానికీ పార్లమెంటు నడుం బిగించాలన్నారు.

"నిజాయతీ, నిష్పాక్షికత, రాజ్యాంగం పట్ల గౌరవం, రాజకీయాల్లో, వ్యవస్థల్లో మౌలికమార్పు కోసం అసాధారణ కృషి అర్హతలుగా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఈ పోరాటానికి పిలుపునిస్తోంది. కానీ ఈ పోరాటం చేయాల్సిన బాధ్యత, అధికారం పార్లమెంటుది, పౌరసమాజానిది. లోక్‌సత్తా తన వంతు పాత్ర పోషిస్తుంది" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ❖

# వ్యవస్థీకృత సంస్కరణే పరిష్కారం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

**99**వ రాజ్యాంగ సవరణపై సుప్రీంకోర్టు తీర్పు మన దేశ వ్యవస్థల మధ్య పరస్పర అపనమ్మకానికి నిలువెత్తు నిదర్శనం. సుప్రీంకోర్టు తీర్పులోని వాదన ప్రజాస్వామ్య ప్రక్రియకి వ్యతిరేకం. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ విధానాలను, ప్రమాణాలను కనీసం పరిగణలోకి తీసుకోకుండా ఇచ్చిన తీర్పు న్యాయస్థానం విశ్వసనీయతను, సాధికారతను కూడా దెబ్బతీసింది. అత్యున్నత న్యాయస్థానం వాదనలో మూడు మౌలికమైన సమస్యలు ఉన్నాయి.

మొదటిది, ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థయినా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రజల నుంచే ఏర్పడాలి. లేకుంటే విశ్వసనీయత, నైతికత ఉండదు. లోక్‌సభ ప్రజల నుంచి నేరుగా ఎన్నికవుతుంటే, రాజ్యసభ రాష్ట్రాల శాసనసభల నుంచి ఎన్నికవుతుంది. చట్టసభల నుంచి ప్రభుత్వం ఎన్నికై ఆ సభకు జవాబుదారీ వహిస్తుంది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి చట్టసభల నుంచే ఎన్నికవుతారు. మిగతా అన్ని సంస్థలు కూడా జవాబుదారీతనం గల ప్రభుత్వం నుంచి లేదా ప్రభుత్వం, శాసన వ్యవస్థల ద్వారా చట్టబద్ధ ప్రక్రియతో ఎంపికవుతాయి. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా ప్రక్రియలు ఉంటాయి. ఎన్నికవ్వని వ్యవస్థ ఎంత గొప్పదైనా కావచ్చు, కానీ తన నియామకాలను, వారసుల్ని తానే నిర్ణయించుకునే అధికారాలుండవు. అటువంటి ప్రక్రియకు ప్రజాస్వామిక జవాబుదారీతనం, ప్రజల ప్రత్యక్ష లేదా పరోక్ష ఆమోద ముద్ర ఉండదు.

న్యాయ స్వతంత్ర ప్రతిపత్తి అంటే, పదవుల్లో ఉన్న జడ్జీలే కొత్త జడ్జీల నియామకాలను చేసేసుకోవటం అని మనం అంగీకరిస్తే, ఇక స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషనర్లు, పబ్లిక్ సర్వీసు కమిషన్లు, కాగ్ (సీఏజీ), సీవీసీ, లోక్‌పాల్, లోకాయుక్తలు, సీబీఐ అధికారులు తమ సహచరుల్ని, వారసుల్ని తామే నియమించేసుకునేలా అధికారాల్ని అప్పగించే వ్యవస్థను ఇక మనం ఏర్పరుచుకోవాలన్న మాట! అటువంటి వ్యవస్థ స్వయంభులుగా సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకునే



ఫ్యూడల్ కూటమి, పీఠాధిపతుల వ్యవస్థలాగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకి, పార్లమెంటు సార్వభౌమాధికారానికి మధ్య ఘర్షణ తలెత్తకూడదు. ప్రజాస్వామ్య ప్రక్రియతో, ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా దైవాంశసంభూత అధికారాలు తమకున్నాయని ఏ విభాగం లేదా సంస్థయినా భావించటం మన ప్రజాస్వామ్య భవిష్యత్తుకి ప్రమాదకర ఘంటిక.

రెండోది, న్యాయవ్యవస్థ తనను తానే నియమించు కోవటమనేది ప్రపంచంలోని ఏ క్రియాశీల ప్రజాస్వామ్యంలోనూ లేదు. ఇంగ్లండ్, వేల్స్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రజలు (పారదర్శక బహిరంగ పోటీ, జ్యుడీషియల్ కౌన్సిల్ ద్వారా సమాజం నుంచి ఈ సభ్యుల్ని కమిటీలోకి ఎంపిక చేస్తారు) నియామకాలను సిఫార్సు చేస్తారు. ప్రభుత్వం (క్రౌన్) ఆ సిఫార్సును ఒకసారి తిరస్కరించగలదు. ఐర్లాండ్‌లో ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయేతర రంగాల సభ్యులతో కూడిన 10మంది సభ్యుల కమిటీ (న్యాయశాఖా మంత్రి నియమిస్తారు) సిఫార్సుల్ని చేస్తుంది. ఫ్రాన్స్‌లో అధ్యక్షుడు, న్యాయశాఖా మంత్రి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రాసిక్యూటర్లు, ముగ్గురు సాధారణ పౌరుల (కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థ– మూడూ ఎంపిక చేస్తాయి) తో కూడిన 12మంది సభ్యుల కమిటీ అధ్యక్షుడికి సిఫార్సులు చేస్తుంది. అయితే వీటికి అధ్యక్షుడు కట్టుబడి ఉ

ండాల్సిన అవసరం లేదు. కెనడాలో న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, సాధారణ పౌరులతో కూడిన 8మంది సభ్యుల బృందం విధిగా అమలుచేయనక్కర్లేని సిఫార్సుల్ని చేస్తుంది. ఆస్ట్రేలియాలో నియామకాలను కార్యనిర్వాహక వ్యవస్థే చేస్తుంది. జర్మనీలో రాష్ట్రాల న్యాయశాఖ మంత్రులు, ఫెడరల్ (జాతీయ) సభ నియమించిన వారితో కూడిన 32 మంది సభ్యుల కమిటీ విధిగా అమలుచేయనక్కర్లేని సిఫార్సుల్ని చేస్తుంది.

అమెరికాలో సెనేట్ సలహా, ఆమోదంతో అధ్యక్షుడు నియామకాలు చేస్తారు. దక్షిణాఫ్రికా, డెన్మార్క్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర ప్రజాస్వామిక దేశాలలో ఇదే తరహాలో కార్యనిర్వాహక, శాసన వ్యవస్థల్ని, న్యాయమూర్తుల్ని, బార్ సభ్యుల్ని, సాధారణ పౌరుల్ని ఎంపిక ప్రక్రియలో భాగస్వాముల్ని చేసే పద్ధతులున్నాయి. ఫలానా జడ్జీలనే నియమించాలంటూ తప్పనిసరిగా ఆమోదించాల్సిన సిఫార్సుల్ని కొలీజియం జడ్జీలే చేసే మనదేశ విధానం ప్రజాస్వామ్య ప్రపంచంలోనే న్యాయనియామకాలలో ఎక్కడాలేని పెడధోరణి. 1993 నుంచి భారత్‌లో ఈ కొలీజియం విధానాన్ని ఏకపక్షంగా కొనసాగిస్తున్నారు. జడ్జీల నియామకం కేవలం జడ్జీలకే వదిలేసేటంత సీదాసాదా విషయం కాదనేది ప్రపంచమంతా అంగీకరించిన విషయం.

మూడవది, ప్రజాప్రయోజనాల రీత్యా, ఉన్నత న్యాయవ్యవస్థ విశ్వసనీయతను పరిరక్షించటం అవసరం. ముఖ్యంగా, కులం, మతం, ప్రాంతం, భాష వంటి అంశాల చుట్టూ ఆటవిక భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రజలను చీల్చే మన సమాజంలో ఈ అవసరం మరీ ఎక్కువ. విద్య, ప్రభుత్వోద్యోగాలలో రిజర్వేషన్లకు అనుకూలంగా, వ్యతిరేకంగా తరచూ జరిగే ఆందోళనలు, బాబ్రీ మసీదు-రామ జన్మభూమి వివాదం వంటి భావోద్వేగ అంశాలు, నదీజలాల పంపకాలు, తీవ్ర ఘర్షణకారకాలైన ఇతర వివాదాలను భారత్ వంటి సంక్లిష్ట భిన్నత్వ సమాజంలో పార్టీ రాజకీయాలకు అతీతంగా తర్కం, రాజ్యాంగం, చట్టం ప్రాతిపదికన లోతైన పరిశీలనతో పరిష్కరించాల్సిన అవసరముంది. విశ్వసనీయత ఉండి ప్రజల గౌరవాన్ని పొందే సుప్రీంకోర్టు మాత్రమే రాజ్యాంగాన్ని, దేశాన్ని అటువంటి పరిస్థితుల నుంచి రక్షించి, న్యాయం, రాజ్యాంగం, చట్టం, సామరస్యం, ప్రజాప్రయోజనాలను ప్రభావశీలంగా సమన్వయం చేయగలుగుతుంది. రాజ్యాంగం ఇవ్వని అధికారాలని కూడా కైవశం చేసుకోవటం ద్వారా కోర్టు విశ్వసనీయతను కోల్పోతే, అది న్యాయస్థానాన్నే కాకుండా రాజ్యాంగాన్ని, మన ప్రజాస్వామ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది.

**రాజ్యాంగం ఇవ్వని అధికారాలని కూడా కైవశం చేసుకోవటం ద్వారా కోర్టు విశ్వసనీయతను కోల్పోతే, అది న్యాయస్థానాన్నే కాకుండా రాజ్యాంగాన్ని, మన ప్రజాస్వామ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది.**

ఈ కారణాలతోనే, ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం (ఎఫ్‌డీఆర్) మనదేశంలోనే అత్యంత సామర్థ్యం, విశ్వసనీయతకు పేరొందిన న్యాయకోవిదులు - సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ వెంకటాచలయ్య, (దివంగత) జస్టిస్ జేఎస్ వర్మ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి (దివంగత) జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్‌లను ఒకచోట చేర్చింది. గత నాలుగు దశాబ్దాల కాలంలో అత్యుత్తమ న్యాయమూర్తులు వీరు. వీరి నిజాయతీని, స్వతంత్ర ప్రతిపత్తిని ఎవరూ ప్రశ్నించలేరు. ఈ విశిష్ట న్యాయకోవిదులు న్యాయనియామకాల అంశాన్ని జాగ్రత్తగా, నిశితంగా పరిశీలించి పలు దఫాల చర్చల అనంతరం ఉన్నత న్యాయనియామకాలను సిఫార్సు చేయటానికి జాతీయ జ్యుడీషియల్ కమిషన్ (ఎన్‌జేసీ)ని సిఫార్సు చేశారు. ఈ కృషికి సంబంధించి వివరాలను ప్రతి దశలోనూ ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు ఎఫ్‌డీఆర్ తెలియజేస్తూ వచ్చింది. ఈ అంశంపైన పరిశోధనా పత్రాలను, ముగ్గురు సుప్రసిద్ధ న్యాయకోవిదుల అభిప్రాయాలనూ రాజకీయ వ్యవస్థకు అందించింది. ఆ ఎన్‌జేసీకి మెరుగులు దిద్ది రూపొందించిందే ఎన్‌జేఏసీ.

ఎన్‌జేఏసీ కేసులో సుప్రీంకోర్టు జడ్జీల నియామకాన్ని పరిశీలిస్తున్నప్పుడు, కోర్టు న్యాయ నియంత్రణ పాటించి, ప్రపంచవ్యాప్తంగా పాటిస్తున్న అత్యుత్తమ పద్ధతుల్ని, ప్రజాస్వామిక సూత్రాలను పరిశీలించాల్సింది. పార్లమెంటుకి,

సుప్రీంకోర్టుకి మధ్య ప్రత్యక్ష యుద్ధంలాంటి ప్రతిష్ఠంభన పూర్తిగా నిరోధించటం అవసరం. అందునా న్యాయమూర్తులకి రాజ్యాంగం ఇవ్వని అధికారాల్ని గుర్చిన విచారణలో న్యాయస్థానం నియంత్రణ పాటించి ఉండాల్సిన సందర్భం. కోర్టు అటువంటి నియంత్రణను పాటించటంలో విఫలమైంది కాబట్టి, మనకు ఇప్పుడు రాజ్యాంగ ప్రతిష్ఠంభన ఏర్పడకుండా సంయమనంతో, దూరదృష్టితో వ్యవహరించటం అవసరం.

ఇలాంటి పరిస్థితి తలెత్తవచ్చనే ఆందోళనతోనే ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా పార్టీలకతీతంగా, నిష్పాక్షికత, పరిణతితో రాజ్యాంగబద్ధంగా స్పందించాలని పార్లమెంటరీ నాయకులకు, ఎంపీలకు లేఖ రాసింది. ఎన్‌జేఏసీకి మద్దతు కొనసాగిస్తామని సెప్టెంబర్ 23, 2015న సోనియా గాంధీ సమాధానం పంపారు. పార్టీలకు, చౌకబారు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అంశమిది. మీడియా, పౌరసమాజ నేతలు, పౌర పెద్దలు కలసికట్టుగా ఈ అంశాన్ని ప్రజాస్వామిక సూత్రాలు, న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి, రాజకీయ ఏకాభిప్రాయానికి అనుగుణంగా శాంతియుతంగా పరిష్కరించేందుకు ముందుకు రావాలి. న్యాయ నియామకాలకు మరో పద్ధతిని రూపొందించాలని పార్లమెంటు భావిస్తే, పార్టీ రాజకీయాలకు అతీతంగా సమష్టిగా అందుకు చర్యలు తీసుకోవాలి. ఎన్‌జేఏసీకి సంబంధించి విమర్శకులు లేవనెత్తిన అంశాల్ని అటువంటి కొత్త నమూనాలో పరిగణలోకి తీసుకోవాలి. పార్లమెంటులో ఏకాభిప్రాయం సాధ్యంకానప్పుడు, కొలీజియంపై కోర్టులో వాదనలు వినిపించే సందర్భాన్నే సంస్కరణకు అవకాశంగా ఉపయోగించుకోవాలి. కనీసంలో కనీసంగా, ఇప్పుడున్న అనధికార, రహస్య పద్ధతిని మార్చి క్రోడీకరించిన పారదర్శక పద్ధతిని ఆ స్థానంలో తీసుకురావాలి. అర్హులైన పేర్లను సూచించేందుకు ఒక సెర్చ్ కమిటీని కూడా ఏర్పాటుచేయవచ్చు. మెజారిటీ అభిప్రాయం కన్నా ఏకాభిప్రాయ సూత్రాన్ని అనుసరించాలి. నిజాయతీ, సమర్థత, నిష్పాక్షికతకు సంబంధించి ప్రామాణికత గల అనుమానాల్ని సభ్యుల్లో ఎవరైనా లేదా ప్రభుత్వం లిఖితపూర్వక అభ్యంతరంగా లేవనెత్తితే, అటువంటి వ్యక్తి పేరును నియామకానికి పరిగణలోకి తీసుకోకూడదు.

సుప్రీంకోర్టు కూడా తన పనితీరులోని ఇతర అంశాలను సంస్కరించుకోవాలి. ఆర్టికల్ 136 కింద అన్ని రకాల దరఖాస్తులనూ అనుమతిస్తూ న్యాయస్థానం ట్రయల్ కోర్టులాగా పనిచేస్తోందని పలువురు నిష్ణాతులైన న్యాయకోవిదులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ కారణంగానే, కోర్టులో నియామకాలు 7 నుంచి 28కి పెరిగి న్యాయ ప్రామాణికతను నీరుగార్చాయి. సుప్రీంకోర్టు ఫెడరల్ కోర్టుకు కొనసాగింపు. కేంద్రం-రాష్ట్రాల మధ్య, అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించటం ఈ కోర్టు ప్రధాన బాధ్యత. కానీ అలాంటి కేసులు కొన్ని దశాబ్దాలుగా అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. లెక్కలేనన్ని ఇద్దరు జడ్జీల బెంచీలు కోకొల్లలుగా కేసులను విచారిస్తూ రాజ్యాంగానికి భాష్యం చెబుతూండటం పరస్పర విరుద్ధ రూలింగ్‌లకు, అరాచక గందరగోళానికి దారితీస్తోంది. అత్యంత సీనియర్లతో ఐదు లేదా ఏడుగురు జడ్జీల శాశ్వత రాజ్యాంగ బెంచ్‌ని ఏర్పాటు చేయాల్సిన సమయమిది.

రాజకీయాల్ని ప్రక్షాళన చేసి ప్రజాస్వామిక వ్యవస్థల విశ్వసనీయతను పెంపొందించాల్సిన ఆవశ్యకత సుప్రీంకోర్టు తీర్పుతో ప్రస్ఫుటమైంది. మనందరం రాజకీయ నాయకులను ద్వేషించటానికి ఉత్సాహపడతాం. మన ఎన్నికల విధానం, పాలన తీవ్ర లోపభూయిష్టమైనవి. ప్రజాస్వామిక వ్యవస్థల విలువను కాలరాశాయవి. కానీ భ్రష్టుపట్టిన రాజకీయాలకు సమాధానం దైవదూతల వ్యవస్థో, ఫ్యూడల్ వంశపారంపర్య వ్యవస్థో కాదు; రాజకీయ సంస్కరణలే. రాజకీయ పార్టీలు, ఎన్నికైన చట్టసభ సభ్యులు తమ విధానాలు, విశ్వాసాలు, ప్రజాప్రయోజనాలతో సంబంధం లేకుండా అధికారాన్ని దుర్వినియోగం చేయటం, ఒకరినొకరు అత్యంత బాధ్యతారహితంగా వ్యతిరేకిస్తూండటంలోనే ప్రజల్లో రాజకీయాల పట్ల తిరస్కారం పెరిగిపోయింది. ఈ వాతావరణం రాజకీయాల పట్ల చిన్నచూపునకు, ఎన్నికలతో సంబంధం లేని ఇతర వ్యవస్థలు, వ్యక్తుల మీద మితిమీరి ఆధారపడటానికి దారితీసింది. కానీ దురదృష్టవశాత్తూ, ప్రజాస్వామ్యంలో ఎన్నికైన వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదు. రాజ్యాంగబద్ధతను తిరస్కరించి, ప్రజాస్వామిక ప్రక్రియను లెక్కచేయకుండా ఉంటే చివరికి అది అరాచకానికి, నియంతృత్వానికి దారితీస్తుంది. రాజ్యవ్యవస్థలోని అన్ని విభాగాలనూ సునిశితంగా, హేతుబద్ధంగా సంస్కరించాల్సుంది. 'ఇతర విభాగాలకు సంస్కరణలు, మాకు మాత్రం యథాస్థితి' అంటే కుదరదు. మన రాజకీయాలను, పాలనను, అన్ని రాజ్యవ్యవస్థలనూ ప్రక్షాళన చేసుకోవాల్సిన సమయమిది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...) ❖

# ఇతర ప్రజాస్వామ్య దేశాల్లో ఉన్నత న్యాయవ్యవస్థ నియామక పద్ధతులు

| దేశం | సభ్యుల సంఖ్య | సభ్యుల నేపథ్యం | సభ్యుల నియామకం | సిఫార్సుల అమలు తప్పనిసరా, కాదా |
| --- | --- | --- | --- | --- |
| ఇంగ్లండ్ వేల్స్ | 15 | జడ్జీలు, న్యాయ వాదులు, ప్రజలు | బహిరంగ పోటీ, న్యాయ కౌన్సిల్ ద్వారా | సిఫార్సుల్ని ఒక్కసారి మాత్రం తిరస్కరించవచ్చు |
| ఫ్రాన్స్ | అధ్యక్షుడు, న్యాయ మంత్రి ఎక్స్అఫిషియోతో కలిపి 12మంది | జడ్జీలు, న్యాయవాదులు, ప్రాసిక్యూటర్లు, సాధారణ పౌరులు | కార్యనిర్వాహక, శాసన, న్యాయవ్యవస్థలు | సూత్రప్రాయంగా తిరస్కరణ అధికారం ఉన్నా, అధ్యక్షుడు కౌన్సిల్ సిఫార్సులకే పరిమితమవుతారు. దిగువ కోర్టుల్లో అమలు తప్పనిసరి |
| కెనడా | 8 | న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు, సాధారణ పౌరులు | కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు, బార్ | అమలు తప్పనిసరికాదు, కానీ న్యాయనియామకాలు కమిటీ సిఫార్సులతోనే చేస్తారు |
| జర్మనీ | 32 | రాష్ట్రాల న్యాయశాఖ మంత్రులు, జాతీయ (ఫెడరల్) సభ నియమించినవారు | రాష్ట్ర, ఫెడరల్ లెజిస్లేచర్ (ఎగువ, దిగువ సభలు, కార్యనిర్వాహక వ్యవస్థ) | అమలు తప్పనిసరి కాదు |
| దక్షిణాఫ్రికా | 23 | మంత్రులు, చట్టసభ సభ్యులు, లాయర్లు, లా ప్రొఫెసర్లు, జడ్జీలు | కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థలు, న్యాయ వృత్తిలో ఉన్న వారు | సుప్రీంకోర్టుకు సంబంధించి అమలు తప్పనిసరి. కొత్త జాబితా కావాలని అభ్యంతరం వ్యక్తం చేయవచ్చు. కింది కోర్టుల్లో అమలు తప్పనిసరి. |
| డెన్మార్క్ | 6 | సుప్రీంకోర్టు జడ్జీలు, స్థానిక కోర్టుల జడ్జీలు, ప్రజల నుంచి సభ్యులు ప్రాతిపదికన న్యాయశాఖామంత్రి | పేరొందిన న్యాయ, ప్రజాసంఘాల నుంచి వచ్చిన సిఫార్సుల | అమలు చేయటం ఆనవాయితీ |

| దేశం | సభ్యుల సంఖ్య | సభ్యుల నేపథ్యం | సభ్యుల నియామకం | సిఫార్సుల అమలు తప్పనిసరా, కాదా |
|---|---|---|---|---|
| ఐర్లాండ్ | 10 | ప్రధాన న్యాయమూర్తి, జడ్జీలు, న్యాయవాదులు, న్యాయేతర రంగాల సభ్యులు | బార్ కౌన్సిల్ ఛైర్మన్ లేదా లా సొసైటీ అధ్యక్షుడు నామినేట్ చేయటం, న్యాయ, సమానత్వ మంత్రిచే ముగ్గురు సాధారణ పౌరుల నియామకం | ప్రభుత్వం అమలు చేయటం తప్పనిసరి |
| ఒంటారియో | 24 | లాయర్లు, జడ్జీలు, సాధారణ పౌరులు | జడ్జీలు, మంత్రి ద్వారా నామినేషన్, ఎంపిక | అమలు తప్పనిసరి కాదు కానీ న్యాయనియామకాలు తప్పనిసరిగా కమిటీ సిఫార్సుల ద్వారానే |
| న్యూయార్క్ రాష్ట్రం | 12 | లాయర్లు, సాధారణ పౌరులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు | కార్యనిర్వాహక, శాసన, న్యాయవ్యవస్థలు | కమిటీ సిఫార్సుల ద్వారానే నియామకాలు. ఫెడరల్ సుప్రీంకోర్టు స్థాయిలో నియామకాల కమిషన్ లేకపోవటంతో నియామకాల పద్ధతి ప్రతి రాష్ట్రానికీ మారుతుంది. |

# కొలీజియంపై సుప్రీంకోర్టు వాదన సరికాదు : సోమనాథ్ ఛటర్జీ



అత్యున్నత న్యాయస్థానాలలో జడ్జీలను నియమించడంపై అన్ని హక్కులూ తమకే ఉండాలన్న సుప్రీంకోర్టు వాదన సరికాదని లోక్‌సభ మాజీ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ అన్నారు. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాదిగా అనేక సంవత్సరాలు అనుభవం ఉన్న ఛటర్జీ సుప్రీం తీర్పుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం న్యాయవ్యవస్థతో ఘర్షణ పడకుండానే సమస్యకు పరిష్కారం వెతకాలని, న్యాయ నియామకాలలో ప్రభుత్వ పాత్ర ఉండాల్సిందేనని అన్నారు. కొలీజియం విధానానికి తాను వ్యతిరేకమన్నారు. ఉన్నత న్యాయమూర్తుల నియామక అధికారాలను సుప్రీంకోర్టు చేజిక్కించుకోవటం తగదన్నారు. ఎన్‌జేఏసీని కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పులో ఒక న్యాయమూర్తి మెజారిటీ బెంచ్‌కు భిన్నమైన తీర్పునిచ్చిన అంశాన్ని ఆయన గుర్తుచేస్తూ, ప్రభుత్వం సరైన సమయంలో, సరైన రీతిలో వ్యవహరించాలని సూచించారు. న్యాయవ్యవస్థ ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించుకోవటం భారత్‌లో మాత్రమే జరుగుతోందన్నారు. రాజ్యాంగం, చట్టం ఇలాంటి అధికారాన్ని న్యాయవ్యవస్థకు ఇవ్వలేదని, న్యాయమూర్తులు తీర్పుల ద్వారా తమకు తామే ఇలాంటి విధానాన్ని ఏర్పరుచుకున్నారని అన్నారు. జడ్జీలకే అంతా తెలిసినప్పుడు కొలీజియం విధానంలో మార్పులు తేవటానికి మళ్లీ అందరి వాదనలూ ఎందుకని సోమనాథ్ ఛటర్జీ వ్యాఖ్యానించారు. ❖

# న్యాయవ్యవస్థ జవాబుదారీతనం ఆవశ్యకతపై న్యాయకోవిదుల, రాజనీతిజ్ఞుల అభిప్రాయాలు

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి సంబంధించిన ప్రతి రాజ్యాంగానికీ, రాజ్యానికి సంబంధించిన కార్యనిర్వాహక, న్యాయ, శాసన వ్యవస్థలుంటాయి. కార్యనిర్వాహక వ్యవస్థ శాసన వ్యవస్థకు, .... (లేదా) .... న్యాయవ్యవస్థకు .... లోబడి పనిచేయాలనే నిబంధనను నేను ఏ రాజ్యాంగంలోనూ చూడలేదు..... రాజ్యాంగంలోని ప్రొవిజన్లకు రాజ్యవ్యవస్థలోని అన్ని విభాగాలూ లోబడి పనిచేయాల్సిందే..... రాజ్యాంగాన్ని అమలుచేయాల్సిన వారు, శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలకు తమ విద్యుక్త ధర్మాలు, పరిమితులు, బాధ్యతలు తెలుసనే భావించాలి....

తన అధికారం రాజ్యాంగం ద్వారా పరిమితమని ఏ రాజ్యాంగ అధికార వ్యవస్థ గుర్తుంచుకోకపోతే, ఏ దేశంలోనైనా ఏ రాజ్యాంగబద్ధ ప్రభుత్వమూ పనిచేయలేదు...."

**–డా॥ బి.ఆర్ అంబేద్కర్**

ఏ చట్టాలు రాజ్యాంగబద్ధం, ఏవి కావు అని తమకు సంబంధించినవైనా, తమ విధినిర్వహణ పరిధిలోనైనా, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థకు సంబంధించినవైనా, నిర్ణయించే అధికారం న్యాయమూర్తులకు ఇవ్వాలన్న అభిప్రాయం న్యాయవ్యవస్థను నియంతృత్వ విభాగంగా మారుస్తుంది

**– థామస్ జెఫర్సన్**

ఎక్కువ అధికారాన్ని ప్రదర్శించే పదవిలో ఉన్నవారు జవాబుదారీతనంతో వ్యవహరించటానికి స్వయంగా ముందుకు రావటం పరిణతి ప్రజాస్వామ్యానికి అవసరం. న్యాయాధికారాన్ని జవాబుదారీతనం నుంచి మినహాయించటానికి వీల్లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీయకుండా జవాబుదారీతనానికి పద్ధతుల్ని రూపొందించటం ఎలా అన్నదే సవాలు.

**– ఎ లీ సాయర్, 'డెవలపింగ్ మెకానిజమ్స్ ఫర్ జ్యుడీషియల్ అకౌంటబిలిటీ ఇన్ యు.కె', లీగల్ స్టడీస్, వాల్యూమ్ 24, ఇష్యూ 1-2, 2004**

మన న్యాయమూర్తులు ఎవరు, వాళ్లు ఎలా ఎంపికయ్యారు అనేవి ప్రజాప్రయోజనాల దృష్ట్యా బహిరంగ పరచాల్సిన, చర్చించాల్సిన అంశాలు

**– టామ్ లెగ్, లార్డ్ ఛాన్సలర్స్ విభాగం మాజీ శాశ్వత కార్యదర్శి**

పార్లమెంటు సార్వభౌమాధికారం, చట్టం ప్రాధాన్యత రెండూ పరస్పర వ్యతిరేకంగా కనిపించవచ్చు, ఒకదాన్ని ఇంకోటి నిలువరిస్తున్నట్టుగా అనిపించవచ్చు. కానీ ఇది భ్రమే. పార్లమెంటు సార్వభౌమాధికారం చట్ట ప్రాధాన్యాన్ని అవసరంగా భావిస్తుంది. మన వ్యవస్థల్లో మూస చట్టప్రక్రియ వల్ల ఈ పరిస్థితి తలెత్తుతోంది, ఇది పార్లమెంటు సార్వభౌమాధికారం మరింత పెరగటానికి దోహదం చేస్తుంది.

**– ఎ.వి డైసీ, బ్రిటీషు న్యాయకోవిదుడు, రాజ్యాంగ సిద్ధాంతకర్త**

❖

# లోక్‌సత్తా సుదీర్ఘ కృషి ఎన్‌జేఏసీ

## ఏదోకరూపంలో సంస్కరణ అవసరమని అంగీకరించిన సుప్రీంకోర్టు, న్యాయవ్యవస్థ జవాబుదారీతనంపై తొలిసారి విస్తృత చర్చ

ఇటీవల రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జోర్డాన్, ఇజ్రాయిల్, పాలస్తీనాల్లో పర్యటించినప్పుడు అక్కడి విద్యార్థులు ఆయన ముందు ఒక పెద్ద ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు– కేవలం రెండు భాషలు, ఒకే మతంలో భిన్న వర్గాలు ఉంటేనే ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాల్లో నిరంతరం ఘర్షణలు, రక్తపాతం జరుగుతుంటే, భారత్‌లో అన్ని భాషలు, మతాలు, తెగలు, భిన్న ఆచారవ్యవహారాలు ఉన్నా ఎలా దేశమంతా కలిసి ఉంటోంది? అని వారు అడిగారు. నిజమే, ఆ ఘనత ప్రాథమికంగా మన జాతీయోద్యమ నేతలది. దేశానికి స్వతంత్రం తేవటం కన్నా, మన జాతీయోద్యమ నేతలు సాధించిన గొప్ప కార్యం ఈ దేశమంతటినీ ఏకం చేయటం. మనం పెద్దలు వేసిన పునాదిని మనం కొనసాగించ గలుగుతున్నాం గానీ వారు ఆశించిన జాతి నిర్మాణ లక్ష్యాన్ని మాత్రం ఇంకా సాధించలేకపోతున్నాం. అధికారాన్ని మార్గంగా కాకుండా లక్ష్యంగా భావిస్తూ ఎన్నికల రాజకీయాలకే పరిమితమవుతుండటం, ప్రజల భాగస్వామ్యాన్ని, పారదర్శకతను పెంచే వ్యవస్థల నిర్మాణానికి బదులు ప్రజలతో సంబంధం లేని వ్యవస్థలను పెంచి పోషించటం వంటి నియంతృత్వ పోకడలతో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని దిగజారుస్తున్నాం. జాతి నిర్మాణానికి కీలక సమయాన్ని వృథా చేస్తున్నాం. ఎన్‌జేఏసీ (99వ రాజ్యాంగ సవరణ)ని రద్దు చేస్తూ అక్టోబర్ 16, 2015న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు జాతి నిర్మాణంలో మరో వెనకడుగు అని చెప్పకతప్పదు.

ఈవేళ మనదేశ సమగ్రత, ప్రజాస్వామ్యం కనీస స్థాయిలో నిలబడటానికి న్యాయస్థానాల స్వతంత్ర ప్రతిపత్తి ఓ కీలకకారణమనటంలో ఏమాత్రం సందేహం లేదు. అయోధ్య కేసు కావచ్చు, స్వతంత్ర భారత చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణాలలో ఒకటైన 2 జీ స్పెక్ట్రం లైసెన్సుల కేటాయింపు కేసు కావచ్చు కోర్టు జోక్యం చేసుకోబట్టే అనేక భయంకర పరిణామాలకు అడ్డుకట్టపడింది. 2జీ కుంభకోణంపై లోక్‌సత్తాయే పిటిషన్ వేసి అక్రమ లైసెన్సుల్ని రద్దుచేయించింది, బొగ్గు తదితర ప్రకృతి వనరులకు బహిరంగ వేలం విధానం వచ్చేలా చేసింది. అయితే ఇది న్యాయవ్యవస్థకు ఒక పార్శ్వం మాత్రమే. రెండోపక్కన, ఉన్నత న్యాయవ్యవస్థలో కూడా కొంతమేరైనా అవినీతి, అక్రమాలు జరుగుతున్నట్టు కొందరు ప్రముఖ న్యాయమూర్తులే బహిరంగంగా చెబుతున్నారు.

రాజకీయ జోక్యంతో నియామకాలు చేస్తూ తమపై కేసులు వచ్చినప్పుడు కొన్ని పార్టీల నేతలు 'నాట్‌బిఫోర్' వంటి నాటకాలాడి తప్పించుకుంటున్నారన్న నిర్దిష్ట ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఇటీవల కొందరు న్యాయమూర్తులు బెయిలుకు అనూహ్యస్థాయిలో పదుల కోట్ల లంచం తీసుకున్న కేసులో సాక్ష్యాలతో పట్టుబడ్డారు. న్యాయవ్యవస్థలో అవినీతి, అక్రమాలు జరగటమంటే మన ప్రజాస్వామ్య నిర్మాణానికి చెదలు పట్టటమే. ఆర్థిక సంస్కరణలు వచ్చాక న్యాయవ్యవస్థను ఇంకా పటిష్ఠం చేయకపోతే పరిస్థితి మరింత దిగజారిపోతుంది. లక్షలకోట్ల కుంభకోణాలకు, అవినీతినేతలకు కళ్లెం వేయాలంటే న్యాయవ్యవస్థ తగిన 'ప్రత్యేక' సంస్థాగత ఏర్పాట్లతో అక్షరాలా నిప్పులా పనిచేయాలి. ఉన్నత న్యాయమూర్తుల నియామకాల్లో ఇప్పుడున్న కొలీజియం వ్యవస్థలో జడ్జీలే జడ్జీలను నియమించుకుంటారు. అసలు ఎవరిని, ఎందుకు జడ్జీగా నియమించారో ఎవరికీ అంతుచిక్కదు. నా వీపు నువ్వు గోకు, నీ వీపు నేను గోకుతా అనే రీతిలో ఒకరి అసమర్థతను ఇంకొకరు కప్పిపుచ్చుతూ జడ్జీలుగా నియమితులయ్యే ప్రమాదం ఈ పద్ధతిలో పొంచివుంది.

భారతీయులమైన మేం... అని ప్రజలు రాసుకున్న రాజ్యాంగం చెప్పింది ఇది కాదు. న్యాయవ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి ఉండాల్సిందే కానీ, అది రాజ్యాంగం పరిధిలోనే ఉండాలి. న్యాయమూర్తులు దైవదూతల్లా, దైవాంశసంభూతుల్లా తమను తాము నియమించుకుని, మిగిలినవారెవ్వరూ తమను ప్రశ్నించటానికి వీల్లేదంటే, అక్కడ అవినీతి, అసమర్థతలు

రాజ్యమేలుతున్నా ప్రజలు తలవంచాల్సిందేనంటే, అది రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదు. న్యాయవ్యవస్థ సహా ఏ వ్యవస్థయినా ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీ కావాల్సిందే. అయితే రాజ్యాంగంలో పొందుపరిచినట్టు ఒక్కో వ్యవస్థ ఒక్కో రీతిలో జవాబుదారీ కావాల్సుంటుంది.



# Foundation for Democratic Reforms

6th August, 2012
Hyderabad

To

**Dr. Manmohan Singh**
The Prime Minister of India

*Esteemed Prime Minister Dr Manmohan Singh ji,*

Kindly recall my discussion with you on April 27, 2011. On the same day I wrote to you enclosing the communication and recommendations from three eminent jurists – Sri Justice MN Venkatachaliah, Sri Justice JS Verma and Sri Justice VR Krishna Iyer – on vital judicial reforms.

Judiciary is our most trusted and valued institution. However, the mechanisms for judicial appointments have proved to be inadequate in elevating the best and brightest to the bench. And the existing arrangements to hold erring judges to account have failed.

Foundation for Democratic Reforms (FDR) has therefore initiated a process to pursue judicial reform in the country. We requested three of India's most eminent and credible jurists – Sri Justice MN Venkatachaliah and Sri Justice JS Verma, both former Chief Justices of India, and Sri Justice VR Krishna Iyer, former Judge of Supreme Court – to come together and make suitable unanimous recommendations for judicial reform. The three eminent jurists labored for about a year, and after long and detailed deliberations, they have unanimously agreed upon the following judicial reforms:

- Creation of a National Judicial Commission (NJC) for transparent appointments to the Supreme Court and High Courts. This mechanism would combine the input from the elected branches of the government and the judiciary. The suggested composition and functioning of the NJC for appointments to various courts is given in the ***Note re: NJC*** by Sri Justice MN Venkatachaliah and Shri Justice JS Verma and endorsed by Sri Justice VR Krishna Iyer, based on the *Towards Greater Judicial Accountability* concept paper by FDR (all documents enclosed).
- Replacing the present, cumbersome and unsatisfactory constitutional mechanism of impeachment (under Art. 124 (4)) with a more effective mechanism for removal of errant judges, functioning under the NJC framework.
- Creation of an All India Judicial Service (AIJS) on the lines of IAS and IPS, for enhancing the competence and quality of judges in trial courts, under Art. 312 of the Constitution.

FDR/LOKSATTA - 10-

The proposals of the eminent jurists can be harmoniously and synergistically reconciled with the Judicial Standards and Accountability Bill, 2010, now before the Parliament.

You and other national leaders across party lines have been articulating the need for judicial reforms to protect the independence, integrity and image of the higher judiciary. Our interactions with all major leaders of political parties indicate that there is a broad political consensus in favour of these reforms.

Now is the time to press for genuine judicial reform. Independent, competent and honest judiciary enjoying full public confidence is clearly the need of the hour. We therefore urge you to accelerate the process of judicial reform in line with the proposals of the three eminent jurists.

I am enclosing the letter of the three eminent jurists (dated April 27, 2011) addressed to you, and the joint note prepared by them for your easy reference and expeditious action. In view of the importance of the issue, and the need for building a national consensus, we are taking the liberty of sharing this communication with leaders of political parties, members of Parliament and media.

*With warm personal regards,*

Sincerely,

**Jayaprakash Narayan**
General Secretary

- 11 - FDR/LOKSATTA

**ఆగస్టు 6, 2012 న ప్రధానికి జేపీ లేఖ**

ప్రజలకు ఇంకా పరిణతి లేదు కాబట్టి తమను ఎంపిక చేసే శక్తి వారిలో నుంచి వచ్చిన ప్రతినిధులకు ఉండదని, కాబట్టి తమనుతామే నియమించేసుకుంటామని కొందరు న్యాయమూర్తులు చేస్తున్న వాదన ఈదేశ ప్రజాస్వామ్యాన్ని అవమానించటమే. ఎవరికీ జవాబుదారీకాని వ్యవస్థ ఎంత గొప్పదైనా రాజకీయ జోక్యమున్న వ్యవస్థకన్నా ఎప్పుడోకప్పుడు ప్రమాదకరంగా మారుతుందని చెప్పటానికి బోలెడు ఉదాహరణలున్నాయి. రాజకీయాలను, చట్టసభలను భ్రష్టుపట్టించటం వల్ల, రాజకీయ వ్యవస్థకన్నా న్యాయవ్యవస్థ మీదే ఆధారపడటం మేలు అనే భావన కలగొచ్చు. కానీ అది ఇంకా ప్రమాదకరం. రాజకీయాలను బాగు చేసుకుంటూ, ప్రతి వ్యవస్థ జవాబుదారీతనంతో వ్యవహరించే నిర్మాణాన్ని చేసుకోవటం మినహా ప్రజల సాధికారతకు మరో మార్గం లేదు.

అందుకే జడ్జీలను జడ్జీలే నియమించుకునే కొలీజియం స్థానంలో అప్రజాస్వామిక ఏర్పాటు స్థానంలో న్యాయవ్యవస్థతోపాటు శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల భాగస్వామ్యమున్న జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిషన్‌ను ఏర్పాటు చేయటం వల్ల ఉన్నత న్యాయవ్యవస్థలో జరిగే నియామకాలలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి రాష్ట్రపతి న్యాయమూర్తుల్ని సంప్రదించాలని రాజ్యాంగం చెబుతుంటే, దానికి వక్రభాష్యం చెప్పి మొక్కుబడిగా రాష్ట్రపతికి పేర్లు పంపి కొలీజియం ద్వారా న్యాయమూర్తులే న్యాయమూర్తుల్ని నియమించుకుంటున్నారు. ఒకవేళ రాష్ట్రపతికి అభ్యంతరాలున్నా ఒకసారి తిరస్కరించటం మినహా చేయగలిగిందేమీ లేదు. ఈరకంగా కొలీజియం వ్యవస్థ పూర్తిగా రాజ్యాంగవిరుద్ధం.

ఎన్‌జేఏసీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితోపాటు ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, కేంద్ర న్యాయశాఖ మంత్రి, ఇద్దరు పౌరసమాజ ప్రతినిధులు ఉంటారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ప్యానెల్ పౌరసమాజ ప్రతినిధులను ఎంపిక చేస్తుంది. న్యాయ, కార్యనిర్వాహక, శాసన, పౌర వ్యవస్థల నుంచి ప్రతినిధులతో పరస్పర సమతుల్యతతో ఎన్‌జేఏసీని రూపొందించటం జరిగింది.

ఈ ఎన్‌జేఏసీ ఏర్పాటుకి లోక్‌సత్తా నిశ్శబ్దంగా 10-15 సంవత్సరాల సుదీర్ఘ కృషి చేసింది. న్యాయవ్యవస్థ నుంచి అభ్యంతరాలు రాకుండా ఉండేందుకు జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ ఏర్పాటుకి స్వతంత్ర భారతదేశంలోనే సుప్రసిద్ధులైన ముగ్గురు న్యాయమూర్తులు – సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎన్ వెంకటాచలయ్య, జస్టిస్ జె.ఎస్ వర్మ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.ఆర్ కృష్ణయ్యర్‌ను లోక్‌సత్తా ఒక కమిటీగా ఏర్పాటు చేసింది. వీరిలో జస్టిస్ వెంకటాచలయ్య కొలీజియం వ్యవస్థ వచ్చినప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. జస్టిస్ జేఎస్ వర్మ కొలీజియంను సమర్థించినవారు. అయితే కొలీజియంలో లోపాల్ని సరిదిద్ది రాజ్యాంగ ప్రజాస్వామ్యబద్ధంగా మరో వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న లోక్‌సత్తా వాదనను వారు పూర్తిగా అంగీకరించి జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ కోసం చాలా

సమయం వెచ్చించారు. అలాగే అధికార పక్షం, ప్రతిపక్షం తేడా లేకుండా ఈ బిల్లు ఆమోదం కోసం అన్ని పార్టీలనూ లోక్‌సత్తా ఒక తాటి మీదకు తెచ్చింది. దేశ చరిత్రలోనే అరుదైన విధంగా అన్ని పార్టీలూ పార్లమెంటులో ఏకగ్రీవంగా ఎన్‌జేఏసీ బిల్లును ఆమోదించటం, 20 అసెంబ్లీలు అతితక్కువ కాలవ్యవధిలో ధృవీకరించటం జరిగిందంటే, అధికారం లేకపోయినా లోక్‌సత్తా ఎంత నిజాయతీగా, లోతైన అవగాహనతో ఆ బిల్లును రూపొందించి అందరినీ సమన్వయం చేసిందో అర్థమవుతుంది.

Annexure-B

## Foundation for Democratic Reforms

జైట్లీ, సొరాబ్జీ అభిప్రాయాలతో విభేదించిన ధావన్.. ఎన్‌జేఏసీ రూపకల్పనలో లోపాలున్నాయన్నారు. ఆరుగురు సభ్యులుండడం ఒక లోపమని చెప్పారు. ఎన్‌జేఏసీ ప్రస్తుత రూపం కారణంగా న్యాయమూర్తి నియామకంలో ప్రతిష్టంభన ఏర్పడవచ్చన్నారు. ఈ అభిప్రాయంతో జస్టిస్ లోధా ఏకీభవించారు. న్యాయమూర్తులు పదవీవిరమణ చేసిన తర్వాత పదవులు చేపట్టే అవకాశం న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ముప్పు అన్నారు. ఈ అభిప్రాయంతో మిగిలిన ముగ్గురూ అంగీకరించారు. "పదవీ విరమణ చేయకముందు ఇచ్చే తీర్పులు, పదవీ విరమణ అనంతరం దక్కే ప్రయోజనాల మీద ప్రభావం చూపుతాయి" అని జస్టిస్ లోధా అభిప్రాయపడ్డారు.

❖

# ఏరు దాటాక తెప్ప తగలేశారు!

## బాబు అడగా లేదు, మోదీ ఇవ్వా లేదు.. డ్రామాలాగా అమరావతి శంకుస్థాపన: జేపీ




రాజధాని అమరావతి శంకుస్థాపనకు మట్టి, నీరు, హోమాలు, యజ్ఞాల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చవటం, టీవీల్లో, పత్రికల్లో హోరెత్తటం, ప్రధాని నరేంద్ర మోదీ రాక, చంద్రబాబు సామర్థ్యం పట్ల అంచనాలు ఇవన్నీ చూసి తమ జీవితాలు మారిపోయే ఏదో అద్భుతం జరగబోతోందని ఆంధ్రప్రదేశ్‌లోని ఐదున్నర కోట్ల ప్రజలు కళ్లు ఒత్తులు చేసుకుని ఎదురుచూశారని, విభజన సమయంలో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏదోక గట్టి మేలు జరిగే ప్రకటన వెలువడుతుందని తెలంగాణలోని మూడున్నర కోట్ల మంది ప్రజానీకం ఆశించారని, అయితే చివరికి కొండను తవ్వి ఎలకను పట్టినట్టు ఆ కార్యక్రమం జరిగిందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బాబు అడగా లేదు, మోదీ ఇవ్వా లేదు అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు అందులో సుహృద్భావ వాతావరణంలో పాల్గనటం ఒక్కటే శంకుస్థాపనలో మెరుగైన అంశంగా కనిపిస్తోందన్నారు.

**అమరావతికి ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన, ప్రత్యేక హోదా అంశాలపై జయప్రకాష్ నారాయణ్ అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ,** కేవలం విభజన చట్టం ద్వారా వచ్చేవి ఇవ్వటాన్నే చంద్రబాబు, ఇతర కేంద్ర నాయకులు ఘనంగా చెప్పటం, ప్రత్యేక హోదా, పన్ను రాయితీల గురించి మాట్లాడకపోవటం ప్రజల్ని పట్టపగలే మోసం చేయటమని ధ్వజమెత్తారు. ఏపీకి రాష్ట్ర విభజన వల్ల ఇంతవరకూ ఒరిగిందేమీ లేకపోయినా కనీసం చంద్రబాబు ప్రశ్నించే ప్రయత్నం చేయకపోవటం దారుణమని అన్నారు. కేంద్రం నుంచి వచ్చిన రూ.100, 1000 కోట్ల సహాయమే అదృష్టం, మీ వల్లే మేం బతుకుతున్నాం అనే రీతిలో ముఖ్యమంత్రి అమరావతి వేదిక మీద మాట్లాడారన్నారు. రాష్ట్రంలో రాయలసీమ, ఉత్తరాంధ్రలోని ఏడు జిల్లాలూ ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకంటే వెనకబడి ఉన్నాయని, ఆ గణాంకాలను ప్రధానమంత్రికి వివరించి రాజధాని ప్రాంతంలాగా ఆ ప్రాంతాలు పచ్చగా లేవు, ప్రత్యేక హోదా, పారిశ్రామిక పన్ను రాయితీలు ఇవ్వండన్న ఒక్క ముక్క కూడా చంద్రబాబు నోట రాలేదన్నారు.

**రెవిన్యూ లోటును పూడ్చటం కూడా ఆంధ్రప్రదేశ్‌కే ప్రత్యేకం కాదు, ఆర్థిక సంఘం పత్రం విడుదల**

ఇతర రాష్ట్రాలకు ఇవ్వనిది పిసరంత కూడా రాష్ట్ర విభజన వల్ల హైదరాబాద్‌ని కోల్పోవటం వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కి ఇవ్వలేదని జేపీ స్పష్టం చేశారు. చివరికి ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ లోటును పూడ్చటంలో కూడా కేంద్రప్రభుత్వ ప్రత్యేక సాయం, సానుభూతి, తెలుగువారి పట్ల ప్రేమ ఏమీ లేవన్నారు. ఇందుకు సంబంధించి 14వ ఆర్థిక సంఘం నివేదికలోని వివరాలని జేపీ విడుదల చేశారు. 2015-20 గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా కేంద్రం నుంచి 42శాతం నిధులు బదిలీ చేసినా రెవిన్యూలోటు ఉన్న అన్ని రాష్ట్రాలకూ ఆర్థిక సాయం అందిస్తున్నట్టు ఆ డాక్యుమెంట్‌లో స్పష్టంగా ఉందని, రెవిన్యూ లోటు భర్తీ కింద వచ్చే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ. 22,113 ఇస్తుండగా, పశ్చిమ బెంగాల్‌కి రూ. 11,760 కోట్లు, చిన్న రాష్ట్రమైన కేరళకి రూ. 9519 కోట్లు ఇస్తున్నారని, ఈ మాటను చాలా స్పష్టంగా తెలుగు ప్రజలు గుర్తించాలని అన్నారు.

ఐఐటీ, ఐఐఐటీ, ఐఐఎం వంటివి ప్రతి రాష్ట్రానికీ ఇస్తున్నారని, పెట్రోలియం వర్సిటీ ఒక్కటే అదనంగా వచ్చిందని, దాని వల్ల ఏం ఒరుగుతుందో చూడాల్సుందని జేపీ అన్నారు. ఏపీ నగరాలకు అమృత్ పథకం పెట్టాం, స్మార్ట్ సిటీల సాయం అందిస్తాం, 24 గంటలు విద్యుత్తు ఇచ్చే రాష్ట్రాలలో ఏపీని చేర్చాం వంటివి మభ్యపెట్టే మాటలని, ఇలాంటి సాయాలు అన్ని రాష్ట్రాలకూ అందుతున్నాయని అన్నారు. ఈ మాటలు అబద్ధమైతే రుజువు చేయాలని సవాలు చేశారు.

**రాయలసీమ, ఉత్తరాంధ్ర 7 జిల్లాలు ప్రత్యేక హోదా రాష్ట్రాల కంటే వెనకబడి ఉన్నాయి**

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు కావలసిన మూడు నాలుగు అర్హతల్లో ఒక్కటే ఉందని చెబుతున్నారని, అయితే రాష్ట్రంలోని 13 జిల్లాల్లో రాయలసీమ, ఉత్తరాంధ్రకు చెందిన 7 జిల్లాలు ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాల కంటే అధ్వాన్న స్థితిలో ఉన్నాయని జేపీ గణాంకసహితంగా వివరించారు. ప్రకాశం జిల్లాలోని మార్కాపురాన్ని కూడా రాయలసీమలో భాగంగా గుర్తించాలన్నారు. ప్రత్యేక హోదా కలిగిన చిన్న రాష్ట్రాలు సిక్కిం, మిజోరాం, నాగాలాండ్ వంటి వాటిని మినహాయించి **ఆంధ్రప్రదేశ్‌తో పోల్చదగిన అసోం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్ గణాంకాలను, రాయలసీమ**

**Table: Comparison of socio-economic status of Rayalaseema with Special Category States**

| Parameter \ State/Region | Assam | Himachal Pradesh | Uttarakhand | Jammu & Kashmir | Rayalaseema |
|---|---|---|---|---|---|
| Area ('000 sq. km, Census, 2011) | 78.43 | 55.67 | 53.48 | 222.2 | 67.4 |
| Population (in millions, Census, 2011) | 31.20 | 6.86 | 10.08 | 12.54 | 15.18 |
| Population Density (per sq. km, Census, 2011) | 398 | 123 | 189 | 56 | 225 |
| Infant Mortality Rate (per 1000 live births, 2011, SRS Bulletin 2012) | 55 | 38 | 36 | 41 | 44.5 *(Annual Plan of AP 2013-14)* |
| Literacy Rate (in percentage, Census, 2011) | 72.19 | 82.8 | 78.82 | 67.16 | 66.34 |
| Female Literacy Rate (in percentage, Census, 2011) | 66.27 | 75.93 | 70.01 | 56.43 | 56.5 |
| % Non-availability of drinking water source within premises (Census, 2011) | 45.2 | 44.5 | 41.7 | 51.8 | 70.99 |
| % of HH without latrine facility (Census, 2011) | 35.1 | 30.9 | 34.2 | 48.8 | 60.58 |
| % of Population Below Poverty Line (Planning Commission, 2011-12) | 31.98 | 8.06 | 11.26 | 10.35 | 28 *(2007-08, Srikrishna Committee Report)* |
| Per Capita Net State Domestic Product (current prices 2009-10 in Rs, MoSPI Press Release) | 27197 | 50365 | 59584 | 30582 | 42320 |
| Installed Capacity of Power Utilities (in MW, as on 30.06.2011, All India Installed Generation Capacity Report, Ministry of Power) | 978.84 | 2826.72 | 2455.24 | 2296.14 | 1840 Power Generation Installed Capacity *(Srikrishna Committee* |

www.fdrindia.org

**Table 11.3 : Grants-in-aid for Revenue Deficit (2015-20)**

*(Rs. crore)*

| State | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 | 2015-20 |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| Andhra Pradesh | 6609 | 4930 | 4430 | 3644 | 2499 | 22113 |
| Assam | 2191 | 1188 | Nil | Nil | Nil | 3379 |
| Himachal Pradesh | 8009 | 8232 | 8311 | 8206 | 7866 | 40625 |
| Jammu & Kashmir | 9892 | 10831 | 11849 | 12952 | 14142 | 59666 |
| Kerala | 4640 | 3350 | 1529 | Nil | Nil | 9519 |
| Manipur | 2066 | 2096 | 2091 | 2042 | 1932 | 10227 |
| Meghalaya | 618 | 535 | 404 | 213 | Nil | 1770 |
| Mizoram | 2139 | 2294 | 2446 | 2588 | 2716 | 12183 |
| Nagaland | 3203 | 3451 | 3700 | 3945 | 4177 | 18475 |
| Tripura | 1089 | 1089 | 1059 | 992 | 875 | 5103 |
| West Bengal | 8449 | 3311 | Nil | Nil | Nil | 11760 |
| **Total State** | **48906** | **41308** | **35820** | **34581** | **34206** | **194821** |

*Source: 14th Finance Commission Report*

**(టేబుల్ 11.3) గణాంకాలను జేపీ పోల్చి చూపుతూ మరో పత్రాన్ని జేపీ విడుదల చేశారు.**

"శిశుమరణాల (ప్రతి 1000కి) రేటు అసోం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలలో వరసగా 55, 38, 36, 41 ఉండగా, రాయలసీమలో 44.5 ఉంది. ఆడపిల్లల అక్షరాస్యత 66,76,70,56 ఉండగా, రాయలసీమలో 56.5 ఉంది. మంచినీళ్ల సదుపాయం లేమి 45, 44, 41, 51 ఉండగా, రాయలసీమలో 71 శాతం ఉంది. పేదరికంలో ఉన్న జనాభా ఆ రాష్ట్రాల్లో 32, 8, 11, 10 ఉండగా, రాయలసీమలో 28శాతం ఉంది" అని జేపీ వివరించారు. ఉత్తరాంధ్ర వివరాలు త్వరలో సమగ్రంగా వివరిస్తానన్నారు.

**చంద్రబాబుకు 2 సూటి ప్రశ్నలు**

చంద్రబాబు నాయుడు గారూ! 1) ఈ అంకెలు వాస్తవమా? కాదా? ఈ అంకెలు చూపి రాష్ట్రానికి లేదా కనీసం ఆ జిల్లాలకు ప్రత్యేక హోదా కోసం మీరు కేంద్ర ప్రభుత్వాన్ని అడిగారా?

2) పరిశ్రమలు పెరిగి యువతకు ఉపాధి వచ్చేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ కార్పొరేట్ ఆదాయపన్ను, సెంట్రల్ ఎక్సయిజ్ పన్ను మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నడైనా అడిగారా? అని జేపీ ప్రశ్నించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు, తెలంగాణలోని 10 జిల్లాలకు మొత్తం 23 జిల్లాలకూ ప్రత్యేక హోదా ఇస్తే తెలుగువాడిగా సంతోషిస్తానని, కనీసం మీ నిర్వాకం వల్ల వెనకబడిపోయి ప్రత్యేక హోదా రాష్ట్రాల కంటే కూడా దయనీయంగా ఉన్న జిల్లాలకైనా ప్రత్యేక హోదా సహాయాన్ని అందించాలని జేపీ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఈ గణాంకాలున్న జిల్లాలకు ప్రత్యేక హోదా సాయం అందిస్తే అభ్యంతరం చెప్పాల్సిన పనిలేదన్నారు. కొత్తగా వచ్చే పరిశ్రమలకు నూరుశాతం ఈ పన్ను రాయితీల్ని కల్పించటం వల్ల కేంద్రానికి ఆదాయం తగ్గదని, దీర్ఘకాలంలో పెరుగుతుందని జేపీ అన్నారు. ప్రత్యేక హోదా పేరుతో ఈ రాయితీల వల్లే సమర్థ నాయకత్వం ఉన్న హిమాచల్ ప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో దూసుకుపోతోందన్నారు.

**లంచాలు గుంజే ప్రభుత్వ కార్యాలయాలుండే రాజధానికి అంత ఆర్భాటమా?**

వైకాపా నేత వైఎస్ జగన్ అవినీతిలో కూరుకుపోయి గుడిని, గుడిలో లింగాన్ని కూడా మింగేస్తారని భయపడిన జనం, రాష్ట్ర విభజన ఒక కుట్రలాగా జరగటంలో ప్రధాన పాత్ర పోషించినా ఎంతో కొంత పాలనానుభవంతో మేలు చేస్తారని చంద్రబాబుని క్షమించి ఓటు వేశారని, కనీసం వారి తరపున ఒక్క మాట మాట్లాడటానికి కూడా అమరావతి శంకుస్థాపనలో ముఖ్యమంత్రికి నోరు పెగలలేదని జేపీ అన్నారు. ప్రధానమంత్రిని కలిసినప్పుడు ఢిల్లీలో ప్రెస్ మీట్ మాట్లాడుతూ, రాజధాని ప్రాంతానికి మాత్రమే పన్ను రాయితీలు అడిగానని చంద్రబాబు చెప్పారని, దీనిపై పలుమార్లు లోక్‌సత్తా ప్రశ్నించినా కనీసం సరిదిద్దుకుని ఇతర

ప్రాంతాలకప్రయోజనాలకు చర్యలు చేపట్టటం చేయలేదన్నారు. ప్రతిదీ ఒక తంతుగా, ఆర్భాటంగా మార్చటం తప్ప పరిపాలన పట్ల శ్రద్ధ, పిల్లల భవిష్యత్తు పట్ల ఆలోచన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఉన్నట్టు కనిపించటం లేదన్నారు. మూడు నెలలపాటు గోదావరి పుష్కరాల పేరుతో ఊదర గొట్టారని, ఆ తర్వాత పట్టిసీమ పూర్తయితే చాలు అందరి బతుకులూ బాగుపడిపోతాయన్న భ్రమ కల్పించారని, ఆ తర్వాత అమరావతి నిర్మాణమే అన్ని సమస్యలకూ పరిష్కారమని చెబుతున్నారని అన్నారు. అమరావతి దేవతల నగరమని ప్రచారం చేసుకుంటున్నారని, అక్కడ 30వేల ఎకరాలలో ఉండేవాళ్లు మాత్రం దేవతలు, మిగిలిన ప్రాంతంలోని తెలుగువారు రాక్షసులు, పనికిమాలినవారా? ఆఫ్టాల్ లంచాలు గుంజే ప్రభుత్వ కార్యాలయాలు ఉండే రాజధాని నగరానికి ఇంత ఆర్భాటం అవసరమా? అని ప్రశ్నించారు.

హైదరాబాద్‌ని కోల్పోవటంతో ఆదాయం తగ్గటం, పారిశ్రామికీకరణ లేకపోవటం, వ్యవసాయేతర రంగాలలో ఉపాధి కోసం అలమటించటం వంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రజల మొర వినకుండా, అసెంబ్లీ అనుమతి లేకుండా మెడలు వంచి రాష్ట్ర విభజన చేశారని, పార్లమెంటు ప్రొరోగ్ అవుతోంది కాబట్టి చర్చించే అవకాశం లేదని, తప్పకుండా ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా, ఇతర సహాయాలు చేస్తామని, తమను నమ్మాలని అప్పటి ప్రధానమంత్రి సాక్షాత్తూ పార్లమెంటులో హామీ ఇచ్చారని జేపీ అన్నారు. ఆనాటి ప్రతిపక్షంగా బీజేపీ కూడా అందుకు మద్దతు పలికి, తమ వల్లే ప్రధాని ప్రకటన చేశారని, తామే అధికారంలోకి వస్తాం కాబట్టి తప్పక నెరవేరుస్తామని ఢంకాబజాయించి నమ్మబలికిందని, చివరికి ఇప్పుడు మాట వరసకు కూడా వాటిని ప్రస్తావించటం లేదంటే వీళ్లని ఏమనాలి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అమ్మతోడు ప్రత్యేక హోదా ఇతరసాయాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాటమాత్రం కూడా ప్రస్తావించటం లేదన్నారు. అసాధారణ రీతిలో విభజన చేసినప్పుడు రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానికి ఉందని, రాయలసీమ, ఉత్తరాంధ్ర భారతదేశంలో భాగమా? కాదా? నరేంద్రమోదీ, వెంకయ్య నాయుడు చెప్పాలన్నారు.

**యువతా! కళ్లు తెరవండి**

ప్రజలు ఓట్లు వేసే యంత్రాలుగా తయారుచేసి, పాలకులు రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా కొనసాగటం,రాచరికపు కోటల్లా రాజధానుల్ని నిర్మించటం, యజ్ఞయాగాదులు, నోములు,




ఈ ఖర్చుతో సొంతంగా విమానాలే కొనుక్కోవచ్చుగా సార్...!

వ్రతాలతో అద్భుతాలు జరుగుతాయని ఊదరగొట్టటం వల్ల బిడ్డల భవిష్యత్తు బాగుపడదని జేపీ అన్నారు. పేదరిక నిర్మూలనకు, అభివృద్ధికి కీలకమైన విద్యారంగంలో తెలుగు రాష్ట్రాల దుస్థితి కలచివేస్తోందని, ప్రైవేటు స్కూళ్లలో గత పదేళ్లలో పిల్లలు రెట్టింపైంది ఈ రెండు రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాల్లోనేనన్నారు. 1 నుంచి 8వ తరగతి వరకు పిల్లల్లో 58శాతం వరకూ చిన్న వాక్యం చదవటం, 8వ తరగతిలో సగంమందికి చిన్న భాగాహారం కూడా రావన్నారు. వ్యవసాయ విధానాలతోపాటు విద్య, వైద్య రంగాలలో ఖర్చు, అధ్వాన్న స్థితి వల్లే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కనీసం ఇప్పటికైనా భ్రమలు, అబద్ధాలు ప్రచారం చేయటం ఆపి, పరిపాలన అంటే ఏమిటో గుర్తించి విద్య, ఆరోగ్యం, ఉపాధి, అధికార వికేంద్రీకరణ, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిలేని సేవలకు అత్యవసర ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ‘‘ఇప్పటికే చాలా నష్టపోయాం, కోలుకోలేనంతగా దిగజారకముందే మేలుకోవాలి. కళ్లు తెరవకపోతే, కళ్లు శాశ్వతంగా పోయే ప్రమాదముంది’’ అని యువతకు జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

లోక్‌సత్తా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హైమా పోతినేని, ఏపీ అధికార ప్రతినిధి కూసంపూడి శ్రీనివాస్ సమావేశంలో పాల్గొన్నారు ❖

# ప్రత్యేక హోదా కావాలని బాబు అడగనే లేదు

## సాక్షి ఇంటర్వ్యూలో లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్

*ప్రత్యేక హోదా కల్పించమని కానీ, కనీసం వెనకబడిన ప్రాంతాలకు పన్ను రాయితీలు ప్రకటించమని గానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రాన్ని అడగనే లేదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ ఆవేదన వ్యక్తం చేశారు. హోదా సంజీవని కాకపోతే.. ఇంకేది సంజీవనో చెప్పాలని కేంద్ర మంత్రి వెంకయ్యా నాయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కోరారు. ప్యాకేజీ పేరిట ఇచ్చే డబ్బు పాలకుల ఆర్భాటాలకే తప్ప ప్రజలకు ఉపయోగపడదన్నారు. పరిశ్రమలకు పన్ను రాయితీల వల్ల కేంద్రం మీద ఒక్క పైసా భారం కూడా పడదని, పైగా అదనపు ఆదాయం వస్తుందని విశ్లేషించారు. ప్రత్యేక హోదా పేరు లేకపోయినా, హోదా వల్ల ఒనగూడే ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు..*



**రాష్ట్ర విభజనలో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగింది. దాన్ని కాస్తయినా సరిదిద్దడానికి పార్లమెంటులో అప్పటి ప్రధాని ఇచ్చిన 'ప్రత్యేకహోదా' హామీ ప్రాధాన్యం ఏమిటి?**

గతాన్ని తవ్వి విభజన గురించి మాట్లాడుకోవడం అనవసరం. రాష్ట్రాన్ని కోరుకున్న తెలంగాణ ప్రజల కల సాకారమైంది. తెలంగాణలో మిగులు బడ్జెట్ ఉంది. కానీ ఏపీకి ఆ పరిస్థితి లేదు. ఏపీకి ప్రధానంగా రెండు సమస్యలున్నాయి. మొదటిది రెవిన్యూ లోటు. 2012-13 ఆర్థిక సంవత్సరం లెక్కల ప్రకారం రూ.7వేల కోట్ల లోటు ఉంది. ఇది ఏటా పెరగడమే తప్ప తగ్గే అవకాశం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంతకంటే ఎక్కువే ఉంటుంది. ఎంత లోటు అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించటం లేదు. ఇక రెండోది వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగానే పరిశ్రమలు వచ్చాయి. ఏపీలోని 13 జిల్లాల్లో సుదీర్ఘకాలంగా పారిశ్రామికీకరణ జరగలేదు. ఫలితంగా ఉపాధి అవకాశాలు దాదాపు లేవనే చెప్పాలి. రాయితీలిస్తే పరిశ్రమలు వస్తాయి. పరిశ్రమలు వస్తే యువతకు ఉపాధి లభిస్తుంది. అందుకే ప్రత్యేక హోదాను నేనే తొలుత ప్రతిపాదించాను.

**ప్రత్యేక హోదా సంజీవని కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు... హోదా కల్పించడానికి కావాల్సిన అర్హతలు ఏపీకి లేవని కేంద్ర మంత్రులు... ఇతర రాష్ట్రాలు అడుగుతున్నాయని నేతలు సాకులు చెబుతున్నారు గదా?**

మరి సంజీవని ఏదో వారినే చెప్పమనండి. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే, యువతకు ఉపాధి లభించాలంటే ఏం చేస్తారో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పాలి. ఒడిషా కూడా ప్రత్యేక హోదా అడిగితే ఇవ్వమనండి, మనకు ఎలాంటి అభ్యంతరం లేదు. మనకు ఇవ్వమని మనం అడుగుతున్నాం. సాంకేతికంగా ప్రత్యేక హోదా ప్రకటన సాధ్యం కాకపోతే... హోదా వల్ల ఒనగూడే ప్రయోజనాలు అందించాల్సిన బాధ్యత కేంద్రం మీద ఉంది. ఏపీకి ఐదేళ్లలో రూ.23,500 కోట్లు రెవిన్యూ లోటు ఉంటుందని 14వ ఆర్థికసంఘం చెప్పింది. అది కరెక్టా? కాదా? సరిపోతుందా? లేదా? అని రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రెవిన్యూ లోటు

ఎంత ఉందనే విషయంలో స్పష్టమైన ప్రకటన చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వ రాబడి, ఖర్చు ఎంత? లోటు ఎంత? శ్వేతపత్రం ప్రకటించాలని నేను చాలాసార్లు డిమాండ్ చేశాను. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయంగా లోటును లెక్కగట్టి నిర్దిష్టమైన ప్రకటన చేయలేకపోయింది. అలా ఎందుకు చేయలేదో పాలకులకే తెలియాలి.

**ప్యాకేజీ వస్తే సరిపోతుంది, రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని చంద్రబాబు, వెంకయ్య అంటున్నారు. ప్యాకేజీ న్యాయం చేయగలదా?**

ఐఐటీ, ఐఐఎం, రాజధానికి సాయం.. ఇవన్నీ విభజన చట్టంలో చెప్పినవే. అవన్నీ ఎలాగూ ఇవ్వాల్సిందే. బీహార్‌కు రూ. లక్ష కోట్ల ప్యాకేజీ ప్రకటించారు. అవన్నీ ఆ రాష్ట్రానికి ఇస్తున్నవే. ఇవ్వాల్సినదానికి ఏదోపదో కలిపి ప్యాకేజీ అంటున్నారు. ఇవ్వాల్సిన దానికి అదనంగా ఎంత ఇచ్చినా సంతోషమే. కానీ రూ.లక్ష కోట్లు ఇస్తామంటే... మనం బోల్తా పడకూడదు. ప్యాకేజీ పేరుతో నిధులిస్తే పాలకులు ఆర్భాటాలకు ఖర్చుపెట్టటం తప్ప ప్రజలకు అందేదేమీ ఉండదు. ప్రజలకు ఉపాధి కల్పించాలంటే పెట్టుబడులు, పరిశ్రమలు రావడం తప్ప మరో మార్గం లేదు. పన్ను రాయితీలు ఇస్తేనే పరిశ్రమలు వస్తాయి.

**ప్యాకేజీనే హోదాకు ప్రత్యామ్నాయంగా చూడొచ్చా?**

చేపల కూర వండిపెట్టటం కాదు.. చేపలు పట్టటం నేర్పాలి అని చైనా సామెత. ప్యాకేజీ అంటే చేపల కూర. పన్ను రాయితీలు.. చేపలు పట్టటానికి ఉపయోగపడే గాలం లాంటిది. గాలం ఇవ్వాలని అడగాలి తప్ప.. చేపలు వండిపెట్టమని అడగకూడదు.

**పన్ను రాయితీల సాధనకు ఏం చేయాలి?**

బాబు ఢిల్లీ వెళ్లి.. రాజధాని ప్రాంతానికి రాయితీలు ఇవ్వమని అడిగారే తప్ప.. రాష్ట్రానికి మొత్తం ఇవ్వమనిగానీ, కనీసం వెనకబడిన ప్రాంతాలకు ఇవ్వమనిగానీ అడగనే లేదు. ఇది అన్యాయం. ఆర్భాటమంతా రాజధాని కోసమేనా! అడిగేవారు స్పష్టంగా అడగకపోతే.. ఇచ్చేవాళ్లు ఎలా ఇస్తారు? ఉపాధి కల్పన కోసం నిర్దిష్టంగా పన్ను రాయితీలు ఇవ్వమని రాష్ట్ర ప్రభుత్వం అడిగిన సందర్భమే లేదు.

**ఉపాధి కల్పించడానికి ఉపయోగపడే ప్రత్యేక హోదా (పన్ను రాయితీలు) ఇవ్వడం వల్ల కేంద్రం మీద ఎంత భారం ఉంటుంది?**

ప్రత్యేక హోదా కానీ.. పేరు ఇంకేదైనా కానివ్వండి, పన్ను రాయితీలు కల్పించమని అడుగుతున్నాం. పన్ను రాయితీలు ఇవ్వడం వల్ల కేంద్ర ప్రభుత్వం మీద ఒక్క పైసా భారం కూడా పడదు. కొత్త పరిశ్రమల ఏర్పాటు వల్ల అదనంగా వచ్చే పన్నులు పదేళ్లపాటు రావు. అంతేతప్ప వస్తున్న ఆదాయానికి నష్టం లేదు. ఉపాధి పెరిగితే, ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగితే.. ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వాలకు ఆదాయం సమకూరుతుంది.

**కేంద్రం సాంకేతిక కారణాలు చూపిస్తూ హోదా ప్రకటన వాయిదా వేస్తే నష్టం తీవ్రంగా ఉంటుంది కదా?**

రాష్ట్ర శాసనసభ అనుమతి లేకున్నా, ఒక ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా పట్టించుకోకుండా కేంద్రం రాష్ట్రాన్ని విభజించింది. పరిశ్రమలన్నీ హైదరాబాద్ పరిసరాల్లోనే ఉన్నాయని అంగీకరించింది. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకి అనుకూలంగా రాయితీలు ఇస్తామనీ ప్రకటించింది. కానీ ఇప్పుడు వెనక్కిపోతోంది. వెనకబాటుతనాన్ని ఆధారంగా చేసుకుని దేశంలో చాలా రాష్ట్రాలకు కేంద్రం ప్రత్యేక రాయితీలు ఇచ్చింది. రాష్ట్రమంతా కలిపిచూస్తే వెనకబాటుతనం పెద్దగా కనిపించపోవచ్చు. కానీ రాయలసీమలోని 4, ఉత్తరాంధ్ర 3 జిల్లాల్లో వెనకబాటుతనం స్పష్టంగా కనిపిస్తుంది. ఆ జిల్లాలకు ప్రత్యేక రాయితీలు వెంటనే ప్రకటించాలి. ఆ జిల్లాల్లో పెట్టుబడులు వస్తే.. రాష్ట్రమే అభివృద్ధి చెందుతుంది.

**పన్ను రాయితీల గడువు ముగిసినా అభివృద్ధి కొనసాగుతుందా?**

ఏదో పెట్టుబడి రాయితీ కింద రూ.20లక్షల మినహాయింపు, రవాణా రాయితీ కల్పిస్తామంటే సరిపోదు. కార్పొరేట్ ఆదాయపు పన్ను, సెంట్రల్ ఎక్సయిజ్ నూటికి నూరుశాతం మినహాయింపు ఇవ్వాలి. అలా చేస్తే.. ఇక్కడ తయారయ్యే వస్తువు ఖరీదు కనీసం 30శాతం తగ్గుతుంది. అంటే, దేశంలో ఎక్కడైనా ఒక వస్తువును తయారుచేయడానికి 100 ఖర్చయితే, రాయితీలున్న రాష్ట్రంలో రూ. 70కే తయారుచేయవచ్చు. తక్కువ ధరలో ఉత్పత్తి చేసే అవకాశం ఉంటే పరిశ్రమలు ఆటోమేటిక్‌గా వస్తాయి. పదేళ్లు రాయితీలు ఉండి పారిశ్రామికీకరణ జరిగితే.. తర్వాత అభివృద్ధి జరుగుతుంది.

# పోలీసు సంస్కరణలకు పూర్తి మద్దతు

## లోక్‌సత్తా టైమ్స్ తాజా సంచికను ఆవిష్కరించిన తెలంగాణ డీజీపీ



పోలీసు సంస్కరణలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, అవి అమలు జరగాలన్నది తమ ఆకాంక్షని తెలంగాణ రాష్ట్ర డీజీపీ అనురాగ్ శర్మ అన్నారు. పోలీసు సంస్కరణలపై రూపొందించిన లోక్‌సత్తా పార్టీ భావజాల పత్రిక 'లోక్‌సత్తా టైమ్స్' తాజా సంచికను పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఆయన డీజీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోల్కర్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము, ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి, జయప్రకాష్, గద్దం సతీష్ కుమార్ రెడ్డి, రామన్న తదితర నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అనురాగ్ శర్మ మాట్లాడుతూ, పోలీసు సంస్కరణల కోసం ఎంతోకాలంగా కృషి చేస్తూ, లోతైన అధ్యయనంతో ఈ అంశంపై అనేక నివేదికల్ని కూడా రూపొందించిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ టైమ్స్‌లో రాసిన వ్యాసంలోని అంశాలతో తాను ఏకీభవిస్తానని, అయితే అవి అమల్లోకి రావటానికి సమయం పడుతుందని అన్నారు. సీసీ కెమేరాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులిచ్చిందని, మహిళలకు 33శాతం రిజర్వేషన్లు, ఫోరెన్సిక్ ల్యాబ్‌ల సంఖ్య పెంచటం వంటి అంశాల మీద క్రమంగా దృష్టి సారిస్తామని తెలిపారు.

### పోలీసు సంస్కరణలతోనే ప్రజలకు భద్రత: జేపీ

అనంతరం బేగంపేటలోని కార్యాలయంలో జయప్రకాష్ నారాయణ్ చేత కూడా పోలీసు సంస్కరణల లోక్‌సత్తా టైమ్స్‌ని పార్టీ నేతలు ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, పదేళ్లుగా పోలీసు సంస్కరణల కోసం లోక్‌సత్తా కృషి చేస్తుంటే, కనీసం ఇప్పుడు వాటి గురించి మాట్లాడుతున్నారని, నిర్దిష్ట పరిష్కారాలను ప్రజల్లోకి తీసుకెళ్లగలుగుతున్నామని అన్నారు. పోలీసు వ్యవస్థ మీద పట్టును వదులుకోవటానికి రాజకీయ నాయకులు సిద్ధంగా లేకపోవటం వల్ల సమస్య జటిలమవుతోందని, బహుముఖ సంస్కరణలతో అందరినీ కలుపుకుంటూ ఓపిగ్గా పోలీసు సంస్కరణల్ని సాధించాలని అన్నారు. పోలీసు సంస్కరణలు పోలీసుల కోసం కాదని, ప్రజల కోసమని, తమ భద్రత కోసం పోలీసు సంస్కరణల్ని అమలు చేయాలని ప్రజల నుంచి కూడా ఒత్తిడి రావాలని అన్నారు.

**ప్రజల భద్రత కోసం ముఖ్యంగా ఐదు పోలీసు సంస్కరణలు మన ఎజెండా కావాలని జేపీ అన్నారు:**

"మొదటిది, నేరపరిశోధనను సాధారణ శాంతిభద్రతలను చూసే ఇతర పోలీసు విభాగం నుంచి వేరుచేయాలి. రాజకీయ జోక్యానికి ఆస్కారం లేకుండా నేరపరిశోధనా విభాగానికి జవాబుదారీతనంతో కూడిన స్వయంప్రతిపత్తిని కల్పించాలి.

రెండోది, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన పోలీసు వ్యవస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే మామూలు నేరగాళ్లకన్నా దుర్మార్గంగా తయారవుతుంది. రాజకీయ జోక్యం ఉన్న పోలీసు వ్యవస్థ కన్నా

రోగ్ పోలీసింగ్ దారుణంగా ఉంటుంది. అందుకే పోలీసులకు స్వేచ్ఛనిస్తూనే జవాబుదారీతనంతోపాటు నిరంతర పర్యవేక్షణకు ఏర్పాటు చేయాలి.

మూడోది, పోలీసు సిబ్బంది నియామకాలలో సమూల మార్పులు. దర్యాప్తు విభాగంలో అధికారి స్థాయి నియామకాలనే చేయాలి. కనీసం ఏఎస్ఐ స్థాయి నుంచే రిక్రూట్‌మెంట్ ఉండాలి. యాంత్రికమైన పనులు చేసే పోలీసు పనులకు మాత్రమే కానిస్టేబుల్ స్థాయి నియామకాన్ని కొనసాగించాలి. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో పోలీసు సిబ్బంది సంఖ్యను కనీసం 50శాతం మేర పెంచాలి. ఇప్పుడు కేవలం లక్షమంది జనాభాకు 130 మంది పోలీసులే ఉన్నారు. ప్రతి జిల్లాకూ ఒక ఫోరెన్సిక్ ల్యాబరేటరీని ఏర్పాటు చేయాలి. ఆధునిక సమాచార వ్యవస్థతో పోలీసు బృందాలు వేగంగా స్పందించేలా, నేరాల్ని ఛేదించేలా మౌలిక వసతుల్ని ఏర్పాటు చేయాలి. మహిళా పోలీసు అధికారుల రిక్రూట్‌మెంట్ ఎంతో అవసరం. కొత్త రిక్రూట్‌మెంట్‌లో కనీసం 33శాతం మహిళలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. కమ్యూనిటీ, వలంటీర్ పోలీసింగ్‌ను పోలీసు వ్యవస్థలో భాగంగా చేసి పెట్రోలింగ్, చిన్న నేరాలు, పౌర రక్షణ వంటి పనుల్లో వినియోగించుకోవాలి.




నాలుగోది, స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రాసిక్యూషన్ ఏర్పాటు. జ్యుడీషియరీ నుంచి ప్రతి జిల్లాకూ ఒక జిల్లా అటార్నీని ఐదేళ్ల పదవీకాలంతో ఏర్పాటు చేయాలి. దర్యాప్తు, ప్రాసిక్యూషన్ ఈ అటార్నీ పర్యవేక్షణలోనే జరగాలి. దీనివల్ల మానవ హక్కుల పరిరక్షణ, క్రిమినల్ కోర్టులతో సమన్వయానికి ఎక్కువ అవకాశం ఉంటుంది.

ఐదవది, చిన్న నేరాలను సీబీ, సీఐడీ పరిధిలోకి తేకుండా స్థానిక పోలీసులు, కమ్యూనిటీ బృందాలే పరిష్కరించే ఏర్పాటు చేయాలి. తక్కువ ఖర్చుతో వేగంగా న్యాయం అందించేందుకు, దోషుల్ని శిక్షించేందుకు ప్రతి 50,000 జనాభాకు ఒక స్థానిక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలి. లోక్‌సత్తా కృషితో 2009లో స్థానిక న్యాయస్థానాల (గ్రామన్యాయాలయాల) చట్టం వచ్చింది. కానీ వీటిని ఏర్పాటు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. స్వతంత్ర న్యాయవ్యవస్థలో భాగంగానే స్థానిక న్యాయస్థానాలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తే, మహిళలపై వేధింపులు సహా చాలా రోజువారీ నేరాలను అదుపుచేయవచ్చు" అని జేపీ అన్నారు.

ఇక ఇవన్నీ చేసినా, నేరస్తులు, రాజకీయ నాయకులకు తేడా లేకుండా పోయిన ప్రస్తుత తరుణంలో సరైన రీతిలో సమూల రాజకీయ మార్పుల్ని తీసుకురాకుండా సమాజానికి భద్రత కల్పించటం సాధ్యం కాదని, పోలీసు సంస్కరణలు ఆశించిన లక్ష్యాన్ని సాధించాలంటే మంచి రాజకీయం కీలకమని జయప్రకాష్ నారాయణ్ వివరించారు. ❖

# మార్కెట్ యార్డులను రైతులకు అప్పచెప్పాలి



రైతులు రుణాల వలలో చిక్కుకుని నలిగిపోకుండా ఉండాలంటే పంటలకు మంచి రేటు వచ్చేలా మార్కెట్ యార్డులను ప్రక్షాళన చేయటం కీలకమని, వాటిని రాజకీయ కబంధ హస్తాల నుంచి విముక్తి చేసి రైతులకు అప్పచెప్పాలని, ప్రభుత్వం కేవలం అవినీతి జరగకుండా పర్యవేక్షించే బాధ్యతకే పరిమితం కావాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి సాతులూరి గోవిందరావు అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో రైతులను ఆదుకునే కార్యక్రమంలో భాగంగా మార్కెట్ యార్డులను అధ్యయనం చేసే కార్యక్రమాన్ని ఇటీవల లోక్‌సత్తా పార్టీ చేపట్టింది. అందులో భాగంగా కోదాడ మార్కెట్ యార్డుని గోవిందరావు సందర్శించారు. మార్కెట్ యార్డులో సరైన మౌలిక సదుపాయాలు లేవని, పశువుల కొట్టంలా తయారుచేశారని అన్నారు. రైతులకు తాగునీటి సౌకర్యం, భోజన, విశ్రాంతి సదుపాయాలు లేవని అన్నారు. రామన్నపేట మార్కెట్ యార్డులో సమస్యలు మరింత జటిలంగా ఉన్నాయన్నారు. 20 రోజుల నుంచి రైతులు ధాన్యం అమ్మేందుకు వచ్చినా కొనే దిక్కు లేదన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు రావెళ్ల రవికుమార్, నియోజకవర్గ ఇంఛార్జి ఎస్.నరేంద్ర, అచ్యుతరావు, వట్టికొండ రమణ తదితరులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి**

మార్కెట్‌లోకి ధాన్యం వస్తున్నందున కొనుగోలుకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హుజూర్‌నగర్‌లో గోవిందరావు డిమాండ్ చేశారు. రుణమాఫీ డబ్బుని సక్రమంగా వినియోగించి వుంటే రైతులకు ఇంత సంక్షోభం ఉండేది కాదన్నారు. సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేసే నీటి పరిమాణాన్ని పెంచి ఎండుతున్న పంటలను కాపాడాలన్నారు. మీడియా సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి పి. లింగయ్య, కృష్ణ, జయరాజు, లక్ష్మి, కాశయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



**రైతులకు లాభాలనిచ్చే నూతన వ్యవసాయ విధానాన్ని ప్రకటించాలి**

**కోదాద:** విషవలయంలా కొనసాగుతున్న రైతుల ఆత్మహత్యలు పునరావృతంగా కాకుండా 'రైతులకు ఆదాయం' లక్ష్యంగా నూతన వ్యవసాయ విధానాన్ని ప్రకటించాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి సాతులూరి గోవిందరావు డిమాండ్ చేశారు. కోదాడ పట్టణంలో జరిగిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆత్మహత్యలకు పాల్పడకుండా రైతులకు భరోసా ఇవ్వటంతో పాటు వారికి పరపతి సౌకర్యాన్ని మెరుగుపరచాలని, అధికవడ్డీల బారిన పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఆయుబ్, రావెళ్ల రవికుమార్, రవి, జయ, అభి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ❖

# స్థానిక ప్రభుత్వాల సాధికారత ఊసే లేని స్వచ్ఛభారత్ సీఎంల ఉపసంఘం నివేదిక

ప్రధాని నరేంద్రమోదీకి ఎక్కువ పాప్యులారిటీని తెచ్చిపెట్టిన మిషన్ స్వచ్ఛభారత్. దేశం స్వచ్ఛమవ్వాలంటే కేవలం రోడ్లు, పరిసరాలు శుభ్రంగా ఉండటం, మరుగుదొడ్లు ఉండటం మాత్రమే కాదని తొలుత సాక్షాత్తూ ప్రధానే చెప్పినా, ఇప్పుడు కనీసం ఆ తొలి లక్ష్యం కోసం వేసిన అడుగును కూడా బురదలో వేశానని ఆయనకు బోధపడుతోంది. అందుకే, మొదలైన ఏడాది తర్వాత, స్వచ్ఛభారత్ లక్ష్యం కష్టమేగానీ అసాధ్యం కాదు అని ఓ జ్ఞానోదయ వ్యాఖ్య చేశారు. స్వచ్ఛభారత్ చాలామంచి కార్యక్రమమే కానీ, రూపకల్పనలో ఘోరవైఫల్యం వల్ల కేవలం ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయిందని లోక్‌సత్తా పలుమార్లు చెప్పింది. స్వచ్ఛభారత్ కేవలం ఒకరోజు, రెండ్రోజుల కార్యక్రమం కాదని, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, సెలబ్రిటీలు ప్రజల్లో చైతన్యానికి పనికొస్తారు తప్ప వారు చేసేది కాదని, అది నిరంతరం ప్రజల భాగస్వామ్యంతో జరగాలని, అందుకు స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాల్ని బదిలీ చేసి, ప్రతి పౌరునికీ తలసరి కనీసం రూ. 1000-2000 వార్డు స్థాయిలో నేరుగా కేటాయించాలని లోక్‌సత్తా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చింది. కానీ కార్యక్రమంలో వైఫల్యం కనిపిస్తున్నా, ఇప్పటికే స్వచ్ఛభారత్ ప్రచార ఆర్భాటానికి వెయ్యికోట్లకు పైగా ఖర్చయినా కూడా, స్వచ్ఛభారత్‌పై ఏర్పాటైన నీతిఆయోగ్ ముఖ్యమంత్రుల ఉపసంఘం మాత్రం ఏమాత్రం పట్టించుకున్నట్టు లేదు. ఉపసంఘం నివేదికను చూస్తే, నిధులు, మొక్కుబడి అంశాలే తప్ప స్వచ్ఛభారత్‌కి కీలకమైన వ్యవస్థీకృత ఏర్పాట్ల ప్రస్తావన లేదు. కేంద్రీకృత పాలన, అధికార యంత్రాంగం పెత్తనం చుట్టూనే తప్ప ఎక్కడా ఆ కార్యక్రమాన్ని ప్రజల జీవనశైలిగా మార్చి నిజమైన మార్పుని సాధించేందుకు కీలకమైన స్థానిక సాధికారత ఊసే వారి సూచనల్లో లేదు.



స్వచ్ఛభారత్‌పై నీతి ఆయోగ్ సీఎంల ఉపసంఘం నివేదికను ప్రధాని మోదీకి అందజేస్తున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, మనోహర్‌లాల్ ఖట్టర్, హరీశ్ రావత్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఈ ఉపసంఘంలో బీహార్, ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర, మిజోరం, సిక్కిం, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా ఉన్నారు. స్వచ్ఛభారత్ అమలుకు కావలసిన వనరులు, యంత్రాంగం తదితర అంశాలపై ఏర్పాటైన ఉపసంఘం చేసిన సిఫార్సులు ఇవీ:

- ప్రభుత్వ రంగ సంస్థలు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రంలో కొంతమేర కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల్ని స్వచ్ఛభారత్‌కి కేటాయించాలి
- వనరుల సమీకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ బాండ్లు జారీ చేయాలి
- చెత్తల నుంచి పనికొచ్చేవాటిని ఏరుకునేవారి ఉపాధి దెబ్బతినకుండా వారిని 'వృథా యాజమాన్య వ్యవస్థ'తో అనుసంధానం చేయాలి
- చట్టాలను కఠినంగా అమలు చేస్తూ మనుషుల ద్వారా మానవ మలమూత్రాలను తొలగించే పనిని పూర్తిగా నిర్మూలించాలి

- వ్యర్థాల నుంచి అర్థవంతమైన ఉత్పత్తుల్ని తయారుచేసే ప్రైవేటు రంగానికి పన్ను రాయితీల్ని విస్తరింప చేయాలి. ముఖ్యంగా వ్యర్థాల నుంచి విద్యుత్తుని ఉత్పత్తి చేయటానికి ముందుకు వచ్చే కంపెనీలు మనుగడ సాగించేరీతిలో ధరవరల్ని నిర్ణయించాలి. ఇలాంటి విద్యుత్తుని డిస్కంలు తప్పనిసరిగా కొనేలా ఆదేశమివ్వాలి. పెద్ద పట్టణాల్లో ఇలాంటి కర్మాగారాలు, చిన్న పట్టణాల్లో చెత్త నుంచి సేంద్రీయ ఎరువు వచ్చే యూనిట్లు వచ్చేలా చేయాలి.
- ప్రభుత్వ, ప్రయివేటు రంగ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో ప్రయివేటు భాగస్వామ్యం పాత్ర ఎక్కువ ఉండేలా చూడాలి
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడైనా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని రూ. 15వేలకి పెంచాలి
- ఎవరైనా స్థానిక సంస్థల్లో పోటీచేయాలంటే వారి ఇంట్లో తప్పనిసరిగా మరుగుదొడ్డి ఉండాలి
- బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికేలా ప్రజల్ని విద్యావంతుల్ని చేయటంలో వృత్తిపరమైన నిపుణుల్ని వినియోగించుకోవాలి
- పారిశుద్ధ్యానికి ఒకటోతరగతి నుంచే పాఠ్యాంశాల్లో పెద్దపీట వేయాలి. విద్యాసంస్థల్లో అవగాహనకు విద్యార్థులతో 'స్వచ్ఛ సేనాని' దళాల్ని ఏర్పాటు చేయాలి.
- సేంద్రీయ ఎరువుల్ని ప్రోత్సహించటానికి రసాయన ఎరువులపై రాయితీ తగ్గించాలి



మీ పని వదిలేసి మా పని ఎందుకు చేస్తున్నారో మాకూ అర్థం కావట్లేదు..!

- అన్ని గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాలు, బ్లాకులు, జిల్లాలు, రాష్ట్రాల మధ్య పోటీని పెంచటం కోసం ఏటా స్వచ్ఛభారత్ శ్రేణి (గ్రేడ్)ని కేటాయించి ప్రోత్సాహకాలు ఇవ్వాలి
- నెలలో ఒకరోజు, అక్టోబర్ రెండవ తేదీతో ముగిసేలాగా వారం రోజుల పాటు స్వచ్ఛభారత్‌కి కేటాయించాలి. ఉత్తమంగా పనిచేసినవారిని గుర్తించి, ప్రోత్సహించాలి. ❖

# మంచి రాజకీయం కోసం పనిచేసిన అరుదైన కళాకారుడు

## -'కళ్లు' చిదంబరానికి జేపీ నివాళి-



తనకున్న నైపుణ్యాన్ని, గుర్తింపును మంచి రాజకీయం కోసం వినియోగించిన అరుదైన ప్రజాకళాకారుడు 'కళ్లు' చిదంబరం అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నివాళులర్పించారు.

అవినీతిరహిత పాలన, యువత సాధికారత లక్ష్యాలుగా లోక్‌సత్తా 2012లో పార్టీలకతీతంగా ప్రారంభించిన సురాజ్య ఉద్యమానికి ఆకర్షితులైన చిదంబరం కార్యాలయాన్ని వెతుక్కుని వచ్చి మరీ స్వచ్ఛందంగా పనిచేశారని జేపీ గుర్తుచేసుకున్నారు. 2014 ఎన్నికలలో తనకు ఆరోగ్యం సహకరించకున్నా కూడా ఫోన్‌లు, ఉత్తరాలు, కరపత్రాల ద్వారా లోక్‌సత్తా పార్టీకి ఓటు వేయమని ప్రచారం చేశారన్నారు. అటువంటి కళాకారుడి అకాల మృతి సమాజానికి, లోక్‌సత్తాకు లోటు అన్నారు. చిదంబరం కుటుంబసభ్యులకు జయప్రకాష్ నారాయణ్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ❖

# ప్రత్యేక హోదా సాధనకు లోక్‌సత్తా పోరాడుతుంది

## - పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ

రాష్ట్ర విభజన సమయంలో తెలుగు ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను మొదట ప్రతిపాదించింది లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణేనని, ఆ లక్ష్య సాధనకు లోక్‌సత్తా ఉద్యమిస్తుందని పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ చెప్పారు. ప్రకాశం జిల్లా పర్యటనలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రత్యేక హోదాతోనే ఎ.పి అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రత్యేక హోదా కోసం వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి పోరాటం సానుకూల పరిణామమని, అందరూ సమష్టిగా కేంద్రంపై పోరాడి సాధించుకోవాలని అన్నారు. ప్రత్యేక హోదా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు తమ పార్టీ ఉద్యమ కార్యాచరణను రూపొందించిందన్నారు. హోదా విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన మిత్రపక్షం బీజేపీ రెండూ విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రంలో టీడీపీ పాలన పూర్తిగా భూ, మద్యం, మైనింగ్ మాఫియాతో నిండిపోయిందన్నారు. మూడువేల నుంచి నాలుగువేల ఎకరాలు సరిపోయే రాజధానికి ముప్పై వేల ఎకరాలు కూడా చాలవన్నట్టు సీఎం వ్యవహరించటం దారుణమన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 30 అసెంబ్లీ, 2 ఎంపీ సీట్లు లక్ష్యంగా లోక్‌సత్తా పనిచేస్తోందన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ రాజశేఖర వర్మ, లీగల్ కమిటీ జాతీయ అధ్యక్షుడు నాగేంద్రబాబులతో కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీ జిల్లాలు, నగరాల అధ్యక్షులు, ఇతర బాధ్యతలను తాత్కాలికంగా నియమిస్తుందని, సభ్యత్వ నమోదును ముమ్మరం చేస్తున్నామని సురేంద్ర శ్రీవాస్తవ తెలిపారు.



### కొత్త జిల్లాలపై ప్రజల నుంచి ప్రతిపాదనలు స్వీకరించాలి

అధికార వికేంద్రీకరణ లక్ష్యంగా ప్రజల సౌకర్యార్థం, పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు ఏర్పాటు కావాల్సి ఉందని జిల్లాల పునర్విభజన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై నియమించిన అధ్యయన కమిటీ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి ప్రజా డిమాండ్‌లను, ప్రతిపాదలను ప్రజల నుంచి స్వీకరించాలని డిమాండ్ చేశారు.

నల్గొండ జిల్లాలోని భువనగిరి కేంద్రంగా యాదగిరి జిల్లా, ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం కేంద్రంగా భద్రాచలం జిల్లా ఏర్పాటు చేసి అక్కడి ప్రాంత ప్రజల సౌకర్యాలను మెరుగుపరచాలని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర జనాభా, భౌగోళిక విస్తీర్ణం, వెనకబాటుతనం, ప్రస్తుత జిల్లా కేంద్రానికి ఉన్న దూరం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల సక్రమ అమలు–పర్యవేక్షణ వంటి కీలక అంశాలను జిల్లాల ఏర్పాటులో పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కొత్త జిల్లా ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై జిల్లాల పునర్విభజన సాధన సమితి రూపొందించిన నివేదికను ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీకి త్వరలో అందచేయనున్నట్టు, రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్

సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు తుమ్మనపల్లి శ్రీనివాసు తెలిపారు.

**తిరుమలకు దళారుల బెడద**

తిరుమల దర్శనానికి వచ్చే భక్తులను దళారులు నిలువునా దోచేస్తున్నారని, దీనికి జేఈవో కార్యాలయ పాలక మండలి సహకరిస్తోందని లోక్‌సత్తా పార్టీ చిత్తూరు జిల్లా కన్వీనర్ కల్లూరి బాలసుబ్రమణ్యం ఆరోపించారు. స్థానిక జిల్లా కార్యాలయం క్రియాశీలక కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వీఐపీ దర్శనాల ముసుగులో పాలకమండలిలో కొంతమంది వారి సొంత వ్యాపారాలకు అనుబంధంగా దర్శనాలు చేయించి, ఒక్కొక్క టికెట్టుకు రూ.5 నుంచి 10వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యాపార దృష్టితో ఉన్న పాలక మండలి సభ్యులను వెంటనే తొలగించాలని, లేకుంటే క్షేత్రస్థాయి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్, జిల్లా కో-కన్వీనర్ పార్థసారథి, రాఘవరెడ్డి, మదనమోహన్, మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

**సుప్రీం తీర్పు.. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచటమే**

**విజయనగరం:** జాతీయ న్యాయనియామక సంఘం ఏర్పాటును కొట్టివేస్తూ పాత కొలీజియం వ్యవస్థను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరచటమేనని లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. ఎన్‌జేఏసీ ఏర్పాటుకు లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ ఎప్పటినుంచో కృషి చేస్తున్నారని, లోక్‌సత్తా చొరవతో దేశంలోనే సుప్రసిద్ధ న్యాయమూర్తులు జస్టిస్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ కృష్ణయ్యర్‌లతో కూడిన బృందం తయారుచేసిన మార్గదర్శకాలను పార్లమెంటు ముందుంచి ఎన్‌జేఏసీ అమలైతే దేశ ప్రజలకు జరిగే మేలును వివరించారని తెలిపారు. 22 ఏళ్లుగా కొనసాగుతున్న కొలీజియంను రద్దు చేసి ఎన్‌జేఏసీ తేవాలన్న ప్రతిపాదనకు అన్ని రాజకీయ పార్టీలూ మద్దతిచ్చాయని, ఇది మనదేశ చరిత్రలోనే అపూర్వమైన సంఘటనని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై దేశవ్యాప్త చర్చ జరగాలన్నారు. సమావేశంలో పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

*స్థానిక జిల్లా కార్యాలయం క్రియాశీలక కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వీఐపీ దర్శనాల ముసుగులో పాలకమండలిలో కొంతమంది వారి సొంత వ్యాపారాలకు అనుబంధంగా దర్శనాలు చేయించి, ఒక్కొక్క టికెట్టుకు రూ.5 నుంచి 10వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యాపార దృష్టితో ఉన్న పాలక మండలి సభ్యులను వెంటనే తొలగించాలని, లేకుంటే క్షేత్రస్థాయి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.*

**ప్రచార యావ తగ్గించుకుని వీధి దీపాలు ఏర్పాటు చేయండి**

ప్రచారం కోసం డిజిటల్ బతుకమ్మల్ని ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం, కూకట్‌పల్లి నియోజకవర్గంలో వీధిదీపాలకి నిధుల్ని మాత్రం ఇవ్వటం లేదని లోక్‌సత్తా పార్టీ నేతలు విమర్శించారు. వీధిదీపాలు లేకపోవటం వల్ల నిత్యం ఏదోక చోట చైన్‌స్నాచింగ్‌లు జరుగుతున్నాయన్నారు. రూ.14 కోట్లతో ఐడీఎల్ చెరువు నుంచి హైటెక్ సిటీ వరకు రోడ్డు వేసినా, వీధిదీపాలను మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. ఈ పండగల సీజన్‌లో అద్దెకు తీసుకున్న వీధి లైట్ల డబ్బులతో ఒక డివిజన్ మొత్తం వీధి దీపాలను ఏర్పాటు చేయవచ్చన్నారు. ప్రభుత్వం ప్రచార యావను తగ్గించుకుని ప్రజలకు సౌకర్యాలు, సేవలు మెరుగుపరచటం మీద దృష్టిపెట్టాలన్నారు. మీడియా సమావేశంలో లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, సహ కార్యదర్శి లావణ్య, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంఛార్జి వంశీప్రసాద్, సత్యనారాయణ, జయప్రకాష్, గడ్డం సతీష్ కుమార్ తదితర నేతలు పాల్గొన్నారు.

❖




యూనివర్శిటీ ఆఫ్ ముంబయి క్యాంపస్‌లోని సర్ కొవాసీ జహంగీర్ స్నాతకోత్సవ మందిరంలో నిర్వహించిన 'ఇవోక్ 2015: ప్రజాస్వామ్యం' సమావేశంలో "భారత్‌లో అవినీతిని నిరోధించటంలో సవాళ్లు" అంశంపై యువతనుద్దేశించి ప్రసంగిస్తున్న లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్. బ్రిటీష్ డిప్యూటీ హై కమిషన్, ముంబయి, కొలంబియా యూనివర్శిటీ ఇండియా ఛాప్టర్, ప్రిన్స్‌టన్ క్లబ్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. దేశంలో అత్యంత ప్రభావశీల కృషి చేసిన వారితో చర్చించే అవకాశాన్ని క్రియాశీల యువతీ యువకులకు కల్పించటం లక్ష్యంగా ఇవోక్ వేదికను నాలుగేళ్ల క్రితం ప్రారంభించారు.





Posting Date 07-11-2015

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on November 1st 2015



మన రాజ్యాంగం ఆచరణాత్మకమైనదని భావిస్తున్నాను. శాంతియుత పరిస్థితుల్లోనూ, యుద్ధ సమయం లోనూ ఈ దేశాన్ని కలిపి ఉంచగల సరళత్వం, సుదృఢత్వం ఈ రాజ్యాంగానికి ఉన్నాయి. ఈ కొత్త రాజ్యాంగం విఫలమైతే, ఆ తప్పు రాజ్యాంగాన్ని అమలు చేసే వారిదే తప్ప, రాజ్యాంగానిది కాదు.

- డా॥ బి.ఆర్. అంబేద్కర్

(నవంబర్ 26, 1949న రాజ్యాంగం ఆమోదించే సమయంలో)

| Book-Post<br>PRINTED MATTER | To, |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad